అవధాన పుష్కరిణి

అంతర్జాల మాసపత్రిక

సంపుటి: 1 సంచిక: 2 కార్తిక శుద్ధ విదియ, 23 అక్టోబరు 2025

దక్షిణామ్నాయ శృంగేరీ శ్రీశారదాపీఠాధీశ్వరులు, జగద్గురువులు శ్రీశ్రీశ్రీ భారతీతీర్థ మహాసన్నిధానంవారు,
తత్కరకమలసంజాతులు శ్రీశ్రీశ్రీ విధుశేఖరభారతీ సన్నిధానంవారి దివ్యాశీరనుగ్రహంతో













అవధాన విద్యా విజయతే తరామ్

ప్రచురణ

అవధాన విద్యా వికాస పరిషత్

భాగ్యనగరం

శ్రీమాత్రేనమః









శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా 29.09.2025 సప్తమి, సోమవారం నాడు
శ్రీ వర్గల్ విద్యాసరస్వతీదేవి సన్నిధానంలో 'అవధాన పుష్కరిణి' తొలిసంచిక ఆవిష్కరణ దృశ్యాలు



అవధాన పుష్కరిణి

సంపుటి - 1 అంతర్జాల మాస పత్రిక సంచిక - 2

విశ్వావసు - కార్తికం 2025 23-10-2025 ప్రచురణ: అవధాన విద్యా వికాస పరిషత్

శ్రీయుతమై రసైకలహరీసితమై, వివిధావధాన వి
ద్యాయతధీకవీశ్వరులు తామరలై విరియన్ - త్వదీయ వి
జ్ఞేయ సుపద్యమాధురు లశేషబుధాళుల కిందు విందుగా
నీ యవధాన పుష్కరిణి - ఈప్సితమై వెలుగొందు నందమై

- డా. జి.యం.రామశర్మ, శతావధాని

కార్యాలయం
శ్రీరామ సదనం, 29-1499/6/1,
వెస్ట్ కాకతీయ నగర్, రోడ్ నం.1,
నేరేడుమెట్టు, సికిందరాబాద్ - 500 056
ఫోన్: 9441039146



అవధాన విద్యా వికాస పరిషత్ సేవాకార్యక్రమాలకు ఆర్థికంగా సహకరించదలచిన సహృదయులు ఫోన్ పే ద్వారా స్పందించగలరు.

అవధానవిద్యా విజయతే తరామ్

సంపాదకీయం

దారిదీపాలు



యాదేవీ సర్వ భూతేషు చేతనేత్యభిధీయతే
నమస్తస్యై నమస్తస్యై నమస్తస్యై నమోనమః

కదిలేదీ, కదలనిదీ, కదిలించే శక్తి గలదీ అమ్మ మాత్రమే.

చేతనాచేతములన్నిటా తానై నిలిచిన జగన్మాతకు నమోంజలులు.

దేశమంతా శరన్నవరాత్రులు జరిగాయి. తల్లిని అనేక రూపాల్లో తలచుకొని కొలుచుకున్నాము. **శారదా స్వరూపమే అక్షరాకృతిగా, మానససరోవరంగా, అవధాన పుష్కరిణిరూపంగా ఆరంభమైంది. శరన్నవరాత్రులలో మూలా నక్షత్రం రోజున వర్గల్ శ్రీ విద్యా సరస్వతీ మాత సన్నిధిలో మిత్రుల సమక్షంలో తొలిసంచిక హృదయంగమంగా ఆవిష్కృతమైంది.** తొలి వెలుగులకు మురిసిన పద్యవిద్యాభిమాను లెందరెందరో ఆశీరభినందన లందిస్తున్నారు. అందరికీ హార్దిక కృతజ్ఞతాభివందనాలు.

అవధానవిద్య నిన్నామొన్నటిదికాదు. మనతోనే ఆగిపోరాదు. రేపటి తరానికి ఈ దీపాన్ని నెమ్మదిగా అందించాలి. ఈబాధ్యత తజ్ఞులైన వారందరిపైన ఉంది. అందుకే అడిగిన వెంటనే కాదనకుండా రచనలందిస్తున్నారు. వాటిని క్రమీకరించి ఒకచోట చేర్చడమే మాపని.

సక్రమంగా నడిపించే బాధ్యత సహృదయులందరిదీ. జ్ఞానవినిమయం వల్లనే మేధావికసనం జరుగుతుంది. తొలితరం అవధానులకులేని సౌలభ్యం ఈతరం ఛాత్రావధానులకు ఉంది. దుర్గమ మార్గాల్లో దారిచేసుకుంటూవెళ్ళిన స్థితిపూర్వావధానులది. వారిమార్గదర్శనంలో సాగిపోగల అదృష్టం నేటి తరం అవధానులది. ముఖ్యంగా సామాజిక మాధ్యమం ద్వారా ఎన్నెన్నో విషయాలను అధ్యయనం చేసే అవకాశాలు మెండుగా ఉన్నాయి. అరచేతిలో అక్షయ అక్షర ప్రపంచం ఇమిడి పోతుంది అన్నది పూర్వావధానులకు ఊహకైనా అందని విషయం. ఈతరం ఛాత్రావధానులకు ఎన్నోవిధాలైన దారిదీపాలు అందుబాటులో ఉన్నాయి. ఎన్ని ఉన్నా సక్రమసాధన లేకుంటే మాత్రం గమ్యం అగోచరమే. అందుకే 'సాధనాత్ సాధ్యతే సర్వం' అనే ధ్యేయ వాక్యాన్ని అవధాన విద్యా వికాస పరిషత్ తలదాల్చింది.

ఈ సంచికలలోని విశేషాలున్నీ సక్రమదిశా దర్శనం చేయించగలిగేవే . అనురించి, అనుగమించే వారికి ఈ అక్షరాలన్నీ కరతలామలకాలే. మరి ఇంకెందుకు ఆలస్యం..





సరస్వతీ దేవి స్తుతి

ఉ. శ్రీ రుచిరాంగి సర్వకవి శేఖర వంద్య పదాంబు జాత వం
దారుమనోరువిందముల దావికసింపగ జేయు సూర్య రు
గ్భారము పూను తల్లి! బుధ వర్గము పాలిటి కల్పవల్లి! ర
మ్మా! రసనాగ్ర సీమ నిలుమా! నలుమోముల వాని మానినీ!


-తిరుపతివేంకట కవులు

భావము: ఓ మనోహరాంగీ, గొప్ప కవులందరిచే నమస్కరింప బడుతున్న తల్లీ, నీ పద పద్మములకు మొకరిల్లుతున్న మనస్సు అనే పద్మాలను వికసింపజేసే సూర్య కిరణాల భారమును పూను తల్లీ, పండిత సమూహానికి కల్పలతా, విధాతృపత్నీ, మానినీ, రమ్ము. వచ్చి నా నాలుక కొనపై నిలువమమ్మా.


ఇదీ క్రమణిక

24.4.1919 ప్రొద్దుటూరులో జి.వెంకటశేషశాస్త్రి గారి అవధానము నందలి సమస్యాపూరణ

వార్ష్యవరుల్ విషణ్ణులయి వందురు చుండఁగ నింగినుండి దై
దార్శ్యము చేతవచ్చి తనదట్టపు రెక్కలువిచ్చి సర్వజై
ఘూర్ష్యమునన్ ధరాస్థలికిఁ గ్రక్కున డిగ్గఁగవచ్చు నాతనిన్
దార్క్ష్యునిఁ జూచినంత రఘు నాథుని పాములు వీడిపోయెఁగా



అవధానపుష్కరిణి అన్ని సంచికలూ ఒకచోట. ఈ QR కోడ్ స్కాన్ చేస్తే అంతర్జాలంలో ఇప్పటివరకు వచ్చిన అన్ని సంచికలూ ఒకచోట కనపడు తాయి. అక్కడే చదువుకోవచ్చు లేదా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు



సహృద్వాణి

డా. కడిమిళ్ళ వరప్రసాద్

అవధాన పుష్కరిణి నిర్మాణంలో ఎందరి ప్రతిభ ఉందో ఎంతమంది శ్రమ ఉందో అది కేవలం పుష్కరిణి కాదు సాక్షాన్ మందాకినిలా ప్రవహిస్తోంది. అద్భుతేయం సంచికా

డా.ఎల్లాప్రగడ రామకృష్ణారావు

అవధాన పుష్కరిణి ప్రారంభసంచిక సమాచారసంపూర్ణంగా, సర్వాంగసుందరంగా ఉంది.

చిటితోటి విజయ్ కుమార్

అద్భుతంగా ఉంది. అవధానప్రియులు దాచుకోవలసిన సంచిక. ప్రతిఫలాపేక్ష లేని మీ ప్రయత్నం శశ్వత్ కీర్తిని సంపాదిస్తుంది.

చింతా రామ కృష్ణా రావు

అవధానపుష్కరిణి అత్యద్భుతం. ఎంతో ప్రయోజనకరమయిన అద్భుతాంశాలను సప్రమాణంగా అందించడం ఒకెత్తు – వాటిని ఏర్చి కూర్చి ఎంతో అందంగా రూపకల్పన చేసారు.

మరింగంటి కులశేఖరాచార్య

ఈ శతాబ్దపు విజయ బావుట. ఆంధ్ర భాషాభిమానుల సారస్వత ఆలయం. పద్యరాసానంద పుష్కరిణి. మనోహారిణి తెలుగువారల తపఃఫలం "అవధాన పుష్కరిణి" విజయతే తరామ్. మీ కృషి ఆచంద్ర తారార్కమై నిలిచి వర్ధిల్లుగాక.

అన్నమరాజు ప్రభాకర రావు

అద్భుతంగా వచ్చింది సార్. అన్ని శీర్షికలూ బాగున్నాయి ఒకదాన్ని మించి ఒకటిగా. మొదటి ప్రయత్నమే యింత అద్భుతంగా ఉందంటే, ముందు ముందు పరమాద్భుతాల్ని ఆశించవచ్చు. మీ బలమైన సంకల్పానికి ప్రబలమైన నిదర్శనం ఈ పత్రిక. వర్ధిష్ణువులే కాక మాబోంట్లు కూడా అదృష్టవంతులే

ఆచార్య మసన చెన్నప్ప

ఇది ప్రభావవంతమైన, పరిశోధనాత్మకమైన ప్రతిభావంతమైన ప్రజారంజకమైన అవధాన సాహిత్య సంచిక.





జగద్గురువుల అనుగ్రహం పొందిన అవధాన విద్య

- ఆచార్య మల్లాప్రగడ శ్రీమన్నారాయణ మూర్తి.



దక్షిణామ్నాయ శృంగేరీ శారదాపీఠాధీశ్వరులు శ్రీశ్రీశ్రీ భారతీతీర్థ మహాస్వామివారు అపార తపశ్శక్తిసంపన్నులు, వేద శాస్త్ర విద్యా నిధులు, సారస్వత శేముషీ విభవులు.

వారి కనుసన్నలలో అష్టావధాన, శతావధాన సభలు సుసంపన్నం అయ్యాయి. అవధాన రంగంలో ఆరితేరిన ఎందరో మహనీయులు తాము నేర్చిన విద్యా వైభవాన్ని మహాసన్నిధానం వారి సన్నిధిలో సమర్పణ భావంతో ప్రదర్శించి, జగద్గురువుల ఆశీరక్షతలను తలదాల్చి కృతార్థులైన సందర్భాలు కోకొల్లలు. శృంగేరిలో, స్వామివారు విజయ యాత్రలు నిర్వహించిన వివిధ ప్రదేశాలలో ఈ అవధాన సారస్వత పుష్పాలు వికసించి సంస్కృతి సౌరభాలను వెదజల్లి అందరికీ ఆనందం పంచిపెట్టాయి. స్వామివారి కృపా ప్రసాద ఫలంగా ఈ పరీమళాలు వ్యాపించి, సనాతన ధర్మపరిరక్షణ మహోద్యమానికి ఊత మిచ్చాయి.

అన్ని విధాలుగా తమ గురుదేవుల మార్గాన్నే అనుసరిస్తూ, తత్కర కమల సంజాతులైన శ్రీశ్రీశ్రీ విధుశేఖర భారతీస్వామివారు సాహిత్య విద్యలపట్ల అవ్యాజమైన ఆదరణ కురిపిస్తున్నారు.

ఏ శుభ ముహూర్తంలోనో మహనీయులైన శ్రీ మాడభూషి వారు అవధాన విద్యకు అంకురారోపణం చేశారు. తిరుపతి వేంకట కవులు, కొప్పరపు కవులు అవధాన విద్యాలతకు పాదు చేసి, నీరుపోసి పరిపుష్టం చేశారు. ఆ తరువాత తెలుగునాట అవధాన విద్య బహుముఖాలుగా విస్తరించింది. శ్రీమంతులనూ సామంతులనూ అలరించటం మాత్రమే కాక, సామాన్యులైన సాహిత్య ప్రియుల మన్ననలకు కూడ పాత్రమైంది. కాలక్రమేణా ద్విగుణితమై, చతుర్గుణితమై. దశ గుణితమై, శత, సహస్ర, ద్వి సహస్ర, పంచ సహస్రాలకు చేరుకున్నది. ఇబ్బడి ముబ్బడిగా అవధానాలు ఆంధ్ర రసజ్ఞ శేఖరులకు మృష్టాన్న భోజనం అందిస్తూనే ఉన్నాయి.

మూడు దశాబ్దాల క్రితం హైదరాబాదు నల్లకుంట శంకరమఠంలో శ్రీ కడిమిళ్ళ వరప్రసాద్ గారు, ఆ తరువాత కాళేశ్వరంలో శ్రీ చిర్రావూరి శ్రీరామశర్మగారు, శ్రీ రాళ్ళబండి కవితా ప్రసాద్ గారు, శ్రీ అష్టకాల నరసింహ రామశర్మగారు, శ్రీ గుమ్మన్నగారి లక్ష్మీనరసింహ శర్మగారు, తిగుళ్ళ శ్రీహరిశర్మ గారు అష్టకాలవారు, శ్రీ మాడుగుల నాగఫణిశర్మగారు, 2013లో శ్రీ శ్రీ శ్రీ భారతీ తీర్థమహాస్వామివారి విజయ యాత్ర సందర్భంగా, 2015లో శ్రీశ్రీశ్రీ విధుశేఖర భారతీస్వామివారి విజయయాత్ర సందర్భంగానూ రాజమహేంద్రవరంలో అవధానాలు జరిగాయి.

2017లో విజయవాడలో శృంగేరీ పీఠపాలిత శ్రీ శివరామకృష్ణ క్షేత్రంలో శ్రీ గరికిపాటి నరసింహారావుగారు నిర్వహించిన శతావధానంలో సాంకేతిక దృశ్యమాధ్యమంలో శ్రీశ్రీశ్రీ విధుశేఖర భారతీస్వామివారు మొదటి సమస్యా పృచ్ఛకులుగా వ్యవహరించి, అవధాన అఖండ విజయానికి అనుగ్రహాశీస్సులు వర్షించారు.





2024మార్చిలో అనంతపురంలో శ్రీ శారదాదేవి విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా శ్రీశ్రీశ్రీ విధుశేఖర భారతీ స్వామివారి సన్నిధిలో శ్రీ గన్నవరం లలితాదిత్యగారు సంస్కృతాంధ్ర ద్విగుణిత అష్టావధానం, ప్రత్యక్షంగా సన్నిధానంవారి ఆశీస్సులకు, పరోక్షంగా మహాసన్నిధానంవారి అనుగ్రహానికి పాత్రులయ్యారు.

సన్నిధానం వారి విజయ యాత్రలో రాజమహేంద్రవరం, గుంటూరులలో అష్టావధానాలూ, "మహా మహోపాధ్యాయ" శ్రీ విశ్వనాథ గోపాలకృష్ణగారి పర్యవేక్షణలో ఆచార్య మల్లాప్రగడ శ్రీమన్నారాయణమూర్తిగారి సంచాలకత్వంలో అవధాన సమ్మేళనమూ అద్భుతంగా సుసంపన్నం అయ్యాయి.

అన్ని సభలలోనూ శ్రీశ్రీశ్రీ భారతీ తీర్థ శ్రీచరణులు, శ్రీ శ్రీ శ్రీ విధుశేఖర భారతీ స్వామివారు అవ్యాజమైన వాత్సల్యంతో తమ సాన్నిధ్యాన్ని ప్రసాదించి, ఆశీస్సులు అందించారు. అంతే కాదు. కొన్ని సందర్భాల్లో అప్రస్తుత ప్రసంగ పృచ్ఛకుల ప్రశ్నలనూ అవధానుల సమాధానాలనూ సమీక్షిస్తూ తమ అనుగ్రహ భాషణంలో ఆనందోపదేశాలను ప్రసాదించారు.

రెండేళ్ళక్రితం అనంతపురంలో శ్రీ శ్రీ శ్రీ విధుశేఖర భారతీ స్వామివారి సన్నిధిలో సంస్కృతాంధ్ర అష్టావధానమూ, 2024 జూన్ 10,11,12 తేదీలలో శృంగేరిలో జగద్గురువుల ప్రత్యక్ష సన్నిధిలో శారదా చంద్రమౌళీశ్వరుల సన్నిధిలో సంస్కృతాంధ్ర శతావధానమూ విజయవంతంగా నిర్వహించి, శ్రీ గన్నవరం లలితాదిత్యగారు జగద్గురువుల ఆశీస్సులు అందుకున్నారు.

జగద్గురువుల ఆశీరనుగ్రహ పాత్రులైన "దర్శనమ్" సోదరులు అవధానవిద్యా వికాస పరిషత్తును నెలకొల్పి, నిర్వహిస్తున్న అవధాన శిక్షణ శిబిరాలు సత్ఫలాలను ప్రసాదిస్తున్నాయి. ఎందరో వర్ధమాన అవధానులు విజయవంతంగా అవధానాలు చేస్తున్నారు.


జగద్గురువుల పరిపూర్ణ కరుణా కిరణ ప్రసారంతోనే ఇటీవల వారణాసి శంకర మఠంలో వద్దిపర్తివారి శతావధానం, అవధాన సప్తకం అఖండ విజయం సాధించాయి.

అవధాన విద్య విలువనూ పరమార్థాన్నీ లోకానికి వెల్లడించే లక్ష్యంతో శృంగేరీ జగద్గురువులు ఈ విద్య పట్ల చూపుతున్న అపార కరుణ సాటి లేనిది. విద్వల్లోకం పరవశించి, జగద్గురువుల శ్రీచరణాలకు సాగిలపడుతున్నది.

తెలుగుభాషకు సొంతమైన ఈ అవధాన విద్య శృంగేరీపీఠ జగద్గురువుల అమృతాశీస్సులతో దినదిన ప్రవర్ధమాన మవుతున్నది. ఈ సందర్భంగా ఉభయ జగద్గురువుల శ్రీ చరణాలకు సద్భక్తికంగా సహస్రాధిక ప్రణామాలు సమర్పిస్తూ.
......సెలవు.







సత్కవి ప్రతిభకు తార్కాణం - సమస్యా పూరణం

- శతావధాని డా॥ జి.యం. రామశర్మ

అవధానాలలో సహృదయులకు ఆసక్తిని, అనురక్తిని కలిగించేది సమస్యాపూరణం. ఇది అవధాని యుక్తిని, కవితాశక్తిని నిరూపించే హృదయంగమ ప్రక్రియ. సమస్యాపూరణం ధారణకు నిలిచే అవధానాంశాలలో ఒకటి. ఈ ప్రక్రియ తెలుగు కంటే ముందు సంస్కృత సాహిత్యంలో వెలసింది. సాహిత్యంలో అవధానం కంటే ముందే సమస్యాపూరణం పుట్టింది. 'సమస్యాతు సమాసార్థా' అని అమరకోశం సమస్యను నిర్వచించింది. 'సం' ఉపసర్గ పూర్వక 'అసు' 'క్షేపణే' అను ధాతువు నుండి నిష్పన్నమైన సమస్యా శబ్దానికి 'సమస్యతే సంక్షిప్యతే అర్థోఽ స్యాం(అనగా సంక్షేపించబడిన అర్థము దీనియందు కలదు) అని వ్యుత్పత్తి చెప్పిన అమరకోశకారుడు 'శత చంద్రం నభస్థలం' అనే సమస్యను ఉదాహరణగా చూపి దానికి ఈ క్రింది పూరణను కూడా పొందుపరిచాడు.



శ్లో॥ దామోదర కరాఘాత విహ్వలీకృత చేతసా
దృష్టం చాణూర మల్లేన శతచంద్రం నభస్థలం

ఆకాశంలో నూర్గురు చంద్రులుండుట అనేది సమస్యలోని అసంగతాంశం. అయితే యుద్ధంలో ముకుందుని ముష్టి ఘాతాలచే సంచలించిన హృదయంతో కనులు తిరిగిన చాణూర మల్లునికి ఆకాశం నూర్గురు చంద్రులు కలదిగా కనిపించింది అనే యుక్తమైన పూరణచే సమస్యలోని అసంగతత్త్వం తొలగి సుసంగతత్త్వం ఏర్పడించి. ఏతావతా కవి ప్రజ్ఞా పరీక్షార్థం పూరించడానికి ఈయబడే అసంగతార్థం కలిగిన పద్యపాదమును సమస్యగా వ్యవహరిస్తారని విశదమవుతున్నది.

సమస్యను తెలుగులో 'కైపదమ'ంటారు. 'కైపదమిచ్చువారలును గ్రక్కున పద్యము జెప్పు వారలున్' అని అనంతుడు భోజరాజీయంలో ప్రస్తావించాడు. 13వ శతాబ్దికి చెందిన వాత్స్యాయన మహర్షి సమస్యా పూరణాన్ని 64 కళలలో ఒకటిగా చూపాడు.

పూర్వం ధారా నగరాన్ని పాలించిన భోజరాజు స్వయంగా కవి, కళాపోషకుడు. ఆయన సభలో నవరత్నాలుగా వెలిగిన తొమ్మిది మంది మహాకవులుండే వారని ప్రతీతి. వారితో నవనవోన్మేష కవితా వినోదాలతో భోజుడు ఆనందించేవాడట. కవి కాని మనుజుడు ధారా నగరంలో లేడని అందువల్ల అది కవితాధారా నగరమని ప్రసిద్ధి. ఒకసారి భోజుడు 'టంటంట టంటంటటటంట టంటం' అనే విచిత్రమైన సమస్య నీయగా మహాకవి కాళిదాసు ఇలా పూరించాడట.

శ్లో॥ రాజాభిషేకే మదవిహ్వలాయాః
హస్తచ్యుతో హేమఘటో యువత్యాః
సోపాన మార్గేషు కరోతి శబ్దం
టంటంట టంటంట టటంట టంటం

ఇది రమణీయ పూరణము. దీని భావము - రాజు స్నానం చేసే సమయంలో చూసిన ఒక పరిచారిక(యువతి) తన చేతిలో నున్న బంగారు బిందెను మోహపరవశురాలై జారవిడిచింది. అట్లా జారిపడిన బిందె మెట్లమీదుగా దొర్లుతూ 'టంటంట టంటంట టటంట టంటం - అంటూ శబ్దం చేసింది. ఆ ధ్వనిని బట్టి అక్కడ(సౌధంలో) పదకొండు మెట్లుంటాయని ఒక ధ్వని అంతర్గర్భితం.



మనవి

ఈ పత్రికలోని రచయితలు, కవుల అభిప్రాయాలన్నీ అవధాన విద్యా వికాసం కోసమే

- పత్రికకు వ్యాసాలు, పద్యపూరణలు పంపేవారు యూనికోడ్ లో ఓపెన్ టెక్స్ట్ ఫైల్ రూపంలో మాత్రమే పంపండి.
- PDF , Photo copy రూపంలో పంపినవి స్వీకరించలేము.
- కవులు, రచయితలు తమ పేరు, ఊరు, ఫోన్ నెంబర్ తప్పనిసరిగా వ్రాయండి.
- అవధాన విద్యా వికాస పరిషత్ సమూహంలో కానీ 9441039146 వాట్సాప్ కు **"అవధాన పుష్కరిణిలో ప్రచురణార్థం"** అని వ్రాసి మీ రచనలు పంపవచ్చు.

- సంపాదకులు





భారతదేశంలో ఉండిన స్వతంత్ర రాజ్యాలు 18వ శతాబ్దంలో ఈస్టిండియా కంపెనీలో అంతర్భాగా లైనవి. కంపెనీ పరి పాలనను ఎదిరించలేని చిన్న చిన్న సంస్థానాలు, జమీందారీలు నామమాత్రపు అధికారాలతో మిగిలిపోయినవి. ఈ జమీందారులలో అధికారతృష్ణ, కంపెనీవారికి దాస్యం, భోగలాలసత పెరిగినవి. మహాకావ్యాలు వ్రాయించి అంకితం తీసుకొనే మహారాజులు, కవిదిగ్గజ పోషకులు కనుమరుగైనారు. సంస్థాన ప్రభువులకు, జమీందారులకు కవిత్వం ఒక కాలక్షేప, ఉల్లాసకర వస్తువుగా మారింది.

"జమీందారియుగంలో ఆశుకవితవల్ల, అవధానాలవల్ల, కవుల దేశాటనం వల్ల తెలుగు కవిత్వంలో ఒక రకమైన ఏకత మొలకెత్త దానికి గొప్పులు తవ్వడం జరిగింది. ఒక జమీందారు గారి ఆస్థానంలోని విద్యావినోదాలు చూసి ముచ్చటపడి మరో జమీందారు అటువంటి కవితా కాలక్షేపం అభిలషించడం అవధానాలకు ప్రోత్సాహమిచ్చింది. సాహిత్య పత్రికలలో రిపోర్టయిన అవధానాల గురించి చదివి ఒక ఊరి వాళ్ళు మరొక ఊళ్ళో అవధానాలు ఏర్పాటు చేసేవారు".

"ఆర్థిక కారణాలవల్ల సాహిత్య భావాలలో కూడా మార్పులు వస్తాయి. ఒక ఆస్థానాన్ని అంటి పెట్టుకొనడం కాక నానారాజ సందర్శనం అవసరమవుతుంది. ఇతరుల 'ఆర్డర్లు' మేరకు సరుకు ఉత్పత్తి చేయాలి".

"అవధానాలు చేసే ఆశుకవులు కవిత్వపు అగసాలెలు అయ్యారు. పృచ్ఛకులు బెత్తాయించిన విషయాలమీద అప్పటికప్పుడు నించున్న పళాన కోరిన డిజైన్ల పద్యాలు చెప్పడం కొత్తరకం కవిత్వ వ్యాపారం" అని ఆరుద్ర తన సమగ్రాంధ్ర సాహిత్యం 12వ సంపుటంలో పేర్కొన్నారు. ఏదేమైనప్పటికి తెలుగుపద్యానికి, ఆశుకవిత్వానికి ఇదిఉచ్ఛదశ.

వికాసదశలో వాటి ప్రధాన పరిణామాలు

ఆరంభదశలోని అవధానాంశాలలో సాహిత్య సంబంధమైనవి మూడే. అవి వ్యస్తాక్షరి, అగ్రపద్యగ్రహణాభిరక్తి, సమస్యాపూరణం. ఇవిగాక మిగిలిన క్రముక సంఖ్యాఖ్యానం, ఆరోహణ లేఖనప్రౌఢి, అనవలోకిత శారికాభిలేఖనరీతి, చతురంగం, అవరోహణలేఖన ప్రౌఢి అన్నవి చమత్కార జనకాలైన వినోదాంశాలే. ఈ లక్షణాలను రేటూరి రంగరాజు తన భానుమతీ పరిణయంలో పేర్కొన్నారు.

1849లో పుదూరు సీతారామశాస్త్రి ప్రకటించిన పెద్దబాలశిక్షలో చతురంగం, కవిత్వం, లేఖనం, పఠనం, గణితం, సంగీతం, యుక్తి చెప్పడం, వ్యస్తాక్షరి అనే ఎనిమిదింటిని అష్టావధాన అంశాలుగా పేర్కొన్నారు. 1892 లో తిరుపతి వేంకటకవులు అష్టావధాన అంశాలను గూర్చి ఇలా చెప్పారు.

"పౌరాణోక్తి కవిత్వ పుష్పగణనాన్యస్తాక్షరుల్ లౌక్యగం
భీరోక్త్యంచిత కావ్య పాఠన కళా విద్భాషణంబుల్ ముదం
బారంగా చతురంగ ఖేలనము నీయష్టప్రకారంబు లో
ప్పారున్ శంకర ! ఏకకాలముననే యష్టావధానమ్మునన్"

అనగా కావ్యపాఠం, కవిత్వం, శాస్త్రార్థం, పురాణం, లౌకిక ప్రసంగం, వ్యస్తాక్షరి, చతురంగం, పుష్పగణనం, ఇందులో చదరంగం, పుష్పగణనం తప్ప అన్నీ సాహిత్యసంబంధమైనవే.

దేవులపల్లి సోదరకవులు తమ అవధానంలో ఉద్దిష్టాక్షరి, నిర్దిష్టాక్షరి అనే క్రొత్త అంశాలు చేర్చారు. కాశీ కృష్ణాచార్యులు అశ్వపతి, వారకథనం, ఆశుకథ అనే అంశాలు చేర్చారు. పిసుపాటి చిదంబరశాస్త్రిగారు వివర్గాక్షరి, ఏకసంధాగ్రహణం, శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి సహపఠనం, లిఖితాక్షరి, 1908 లో వేంకటరామకృష్ణకవులు నిషిద్ధాక్షరి వ్యాకరణ ప్రసంగం, 1913లో నందగిరి శేషగిరిరావు గణితాన్ని అవధానాంశాల్లో చేర్చారు. వీరేశలింగం గారు కూడా అవధానం చేశారు. శ్రీమదజ్జాడ ఆదిభట్ల నారాయణదాసు అవధానాల్లో ఇంగ్లీషులో ఉపన్యాసం సంగీత సంబంధమైన ఒక అంశం, మనోగణితం క్రొత్త అంశాలు.

అవధానంలోని అంశాల సంఖ్యతో కాకుండా పృచ్ఛకుల సంఖ్య ఎనిమిది లేక అంతకంటే ఎక్కువ ఉన్నా దాన్ని 'అష్టావధానం' అని వ్యవహరించడం వేలూరి శివరామశాస్త్రి గారితో ప్రారంభమైంది.

1896 లో శ్రీకార్యంపూడి రాజమన్నారుగారి భట్టిప్రోలు అవధానంలో ఇచ్ఛాంక శ్లోకం, జావళీ, కీర్తన అనే మూడు క్రొత్త అంశాలున్నాయి. వెరసి ఇవన్నీ దాదాపు 35 అంశాలు అవుతాయి.

అవధానులు సభానుగుణంగా, ప్రేక్షకానుగుణంగా అంశాలను తమ శక్త్యనుగుణంగా స్వీకరించేవారు. సాధారణ ప్రజలకోసం ఘంటాగణనం, పుష్పగణనం, ఆకాశపురాణం, కథ, మనోగణితం వంటి అంశాలను స్వీకరించేవారు. *(సశేషం)*

యయాతి చరిత్ర

డా. ఆచార్య ఫణీంద్ర

2

అచ్చ తెనుంగు బద్దె మొకటైనను గబ్బములోన నుండినన్ -
హెచ్చని యాడుచుందు; రది యెన్నుచు నేర్పునం బొత్తమెల్ల ని
ట్లచ్చ తెనుంగున= న్నుడువ నందుల చంద మెరుంగువారు నిన్
మెచ్చరొ-యబ్బురం బనరొ - మేలనరో - కొనియాడరో నినున్!

తెలుగు సాహిత్యంలో ఆది కావ్యంగా ప్రసిద్ధి చెందిన నన్నయ విరచిత మహాభారతం ప్రారంభించబడింది ఒక సంస్కృత శ్లోకంతో అన్నది గమనించవలసిన విషయం. దాని తరువాత వచ్చేది తెలుగు భాషలో రచించబడిన పద్యం. పేరుకు తెలుగు పద్యమైనా, అందులో ప్రథమా విభక్తులు తప్ప, మిగితా అంతా సంస్కృత శబ్ద సంశోభితమే! ఆ తరువాత కాస్త అటు ఇటుగా .. ఆ సంస్కృతాంధ్ర శబ్ద సంయోజన శైలి కలిగిన ఒరవడే సుమారు ఐదు శతాబ్దాల పాటు కొనసాగిందన్నది నిర్వివాదాంశం.



తొలిసారిగా అచ్చ తెనుగుబాస పై ఆసక్తిని, అభిమానాన్ని ప్రకటించిన వాడు 12 వ శతాబ్దికి చెందిన నన్నె చోడుడనే కవి వరేణ్యుడు. ఈ కవి కాలానికి సంబంధించి కొంత సందిగ్ధత నెలకొని ఉన్నా, అధిక విమర్శకులు 12 వ శతాబ్దిగానే నిర్ధారించారు. ఇక తెలుగు సాహిత్యంలో తొలి అచ్చ తెనుగు పద్యాన్ని రచించిన మహాకవి పన్నెండవ శతాబ్దికే చెందిన పాల్కురికి సోమనాథుడు. ఆ పైన ఒక కావ్యంలో అచ్చ తెనుగు పద్యానికి స్థానం కల్పించిన వాడు నాచన సోమన కవి. అట్లాగే .. అటు పిమ్మట – తిక్కన సోమయాజి, బమ్మెర పోతన వంటి కవులు సైతం తమ కృతులలో ఒకటి… అర … అచ్చ తెనుగు పద్యాలను వెలయించక పోలేదు. అప్పటికి అదే ఒక గొప్ప విషయం. అయితే అవి యాదృచ్ఛికంగా వారి కలాల నుండి దొరలినవే కాని పూనుకొని వ్రాసినవి కావన్నది గమనార్హం! ఒక సంపూర్ణమైన అచ్చ తెనుగు కావ్యాన్ని రచించాలన్న సరిక్రొత్త తలంపు కలిగి, దీక్షతో ఆ బృహత్కార్యాన్ని … మహత్కార్యాన్ని… సాధించిన ఘనుడు గోల్కొండ ప్రభువుల కాలం (16వ శతాబ్ది) నాటి కవియైన పొనగంటి తెలగనార్యుడు.

ఒకవైపు 16వ శతాబ్దికి చెందిన ఆంధ్ర భోజుడు – శ్రీకృష్ణదేవ రాయలతో బాటు, ఆయన ఆస్థానంలో ఉన్న అష్ట దిగ్గజ కవులు సంస్కృత సమాస భూయిష్ఠంగా ప్రౌఢ ప్రబంధ కావ్యాలను రచిస్తుంటే, తెలంగాణ ప్రాంతంలోని ఈ పొనగంటి తెలగన కవి అచ్చ తెనుగు కావ్య నిర్మాణ లక్ష్యాన్ని చేబూనడానికి ఈ ప్రాంత ప్రభావం ఎంతైనా దోహదపడిందని నిక్కచ్చిగా చెప్పవచ్చు. ఆ విధంగా కావ్య జగతిలో తెలుగు భాషకు సంపూర్ణ న్యాయాన్ని సమకూర్చిన వాడు మహ్మదీయుల పాలనలో ఉన్న ఆనాటి భాగ్యనగరానికి పరిసర ప్రాంతంలో నివసిస్తున్న పొనగంటి తెలగన కవి.

అందుకే .. తెలగన కవి తన "యయాతి చరిత్ర" అన్న అచ్చ తెనుగు కబ్బం యొక్క అవతారికలోని పై పద్యంలో ఇదే విషయాన్ని సగర్వంగా ప్రకటిస్తున్నాడు. "కావ్యంలో ఒక్క అచ్చ తెనుగు పద్యాన్ని అల్లితేనే .. అదే పెద్ద గొప్ప విషయంగా చెప్పుకొంటారు. కానీ అదే లక్ష్యంగా ఎంచుకొని నేర్పుతో గ్రంథమంతా అచ్చ తెనుగులో వ్రాక్రుచ్చు తుంటే, అందు లోపలి చక్కదనాన్ని గుర్తెరిగిన వాళ్ళు నిన్ను మెచ్చుకోరా? పైగా నిష్ఠగా చేసిన ఆ కృషిని చూసి ఆశ్చర్యానికి గురి కారా? ఇది అచ్చ తెనుగు బాసకు శుభకరమైన, శ్రేష్ఠమైన సత్కార్యమనరా? నిన్ను ఎంతగానో ప్రశంసించరా?" అంటూ ఈ పద్యంలో ఆత్మాశ్రయ రీతిలో తనకు తాను ప్రోత్సహించుకొన్నాడు.

ఈ పద్యంలో – "అచ్చ తెనుంగు", "పద్దెము", "కబ్బము", "నేర్పు", "పొత్తము", "చందము", "అబ్బురము", "మేలు", "హెచ్చని యాడు", "ఎన్ను", "నుడువు", "మెచ్చు", "కొనియాడు" … వంటి అచ్చ తెనుగు పదాలు చదువరులను ఆకట్టుకొంటాడు కవి.

సాధారణంగా సాహిత్య లోకంలో ఏదైనా ప్రక్రియకు ఎవరు ఆద్యులో, ఆ తరువాతి తరాలలోని పరిశోధకులో .. విమర్శకులో… పరిశోధించి, నిర్ణయిస్తూ ఉంటారు. కాని పొనగంటి తెలగనార్య కవి "అచ్చ తెనుగు కబ్బం" ప్రక్రియకు తానే ఆద్యుడనని, పైగా ఈ కృషి ఫలితంగా తాను విఖ్యాతుడ నౌతానని చెప్పి, స్వాభిమానాన్ని చాటుకొనడం విశేషం.



గమనిక
- అవధాన పుష్కరిణిలో ప్రచురితమయ్యే ఆయా కవులు, రచయితల అభిప్రాయాలు వారి సొంతం. వాటికి ఏ విధంగానూ ప్రచురణ కర్తలు లేదా సంపాదకులు బాధ్యత వహించరు
- దత్తపది,సమస్యాపూరణలు 77021 21376 నెంబరుకు, ఖండశర్కర పద్యాలు 9441039146 నెంబరుకు పంపగలరు.



పద్యపరిమళం

ఉ. సారమతిం గవీంద్రులు ప్రసన్న కథా కలితార్థయుక్తి లో
నారసి మేలునా, నితరు లక్షరరమ్యత నాదరింప, నా
నా రుచిరార్థ సూక్తినిధి నన్నయభట్టు తెనుంగునన్ మహా
భారతసంహితా రచన బంధురుడయ్యె జగద్ధితంబుగన్
(ఆది - 1 - 26)

ఆదికవి నన్నయ విరచిత మహాభారతావతారికలోని యీ పద్యము విశేషాలకంటే వ్రాయబడిన కాలము, వ్రాసిన కవి కారణముగా ప్రసిద్ధమైనది. వ్రాసినవాడు ఆదికవి కనుక, వ్రాసినది ఆదికావ్యములో కనుక. నన్నయ కన్న మున్ను పద్యకావ్యములు లేనందున, మహాభారతము వంటి బృహద్గ్రంథమును ఆంధ్రీకరించు సందర్భమును పురస్కరించు కొని భావి కవులకు మార్గనిర్దేశము చేయవలసిన బాధ్యత కూడా ఆదికవియైన తనపై నున్నందున కావ్యగత కవిత్వమున కావశ్యకములైన గుణముల నీ పద్యములో నిర్దేశించి తానాచరించినాడు.

ఈ పద్యమున ప్రసన్న కథాకలితార్థ యుక్తి, అక్షరరమ్యత, నానారుచిరార్థసూక్తినిధిత్వము అనునవి నన్నయ పేర్కొన్న గుణములు. వీటన్నింటినీ మించినది జగద్ధితము.

ఈ "ప్రసన్నకథాకలితార్థయుక్తి" అను సమాసములో "కలితార్థ" శబ్దమునకు మారుగా "కవితార్థ" అను రూపాంతరమున్నది. మొదటిదానితో "ప్రసన్నములైన కథలయందు కూర్చబడిన అర్థములతో కూడిన"దనియు, రెండవదానితో "ప్రసన్నమైన కథాకవిత్వము నందలి అర్థములతో కూర్చబడిన" దనియు తెలియవస్తుంది. నన్నయకు పూర్వము కథారూపమైన కవిత్వము లేదు కనుక "కథాకవితార్థయుక్తి" గానే స్వీకరించి, యిటువంటి కవిత్వమునకు నన్నయయే ఆద్యుడని చెప్పుటకు అవకాశమున్నది. అంతే కాక, యీ సమాసము నందలి "ప్రసన్న" అను పదమును కథా, కవిత, అర్థము అను మూడు పదములకు వ్యష్టిగా విశేషముగా గ్రహించిన యెడల - ప్రసన్నమైన కథల తోడను, ప్రసన్నమైన కవిత్వము తోడను, ప్రసన్నమైన అర్థము తోడను భాసిల్లుచుండునని తెలియవస్తుంది.

పైన పేర్కొనబడిన ప్రసన్నతను ఆత్మగతము, అంగగతము అని రెండు విధములుగా చూచినట్లైతే, ఆత్మగత ప్రసన్నత "రసభావసంబంధి" కాగా, అంగగతమైన ప్రసన్నత "శబ్దసంబంధి" గను తెలియనగును. ఈ రెండింటినే అర్థయుక్తి అనియు, అక్షర రమ్యత అనియు నన్నయ భావించి యుండవచ్చును.

మహాభారతములో అనేక ఉపాఖ్యానములున్నవి. గరుడోపాఖ్యానము, యయాతి చరిత్ర, శకుంతలోపాఖ్యానము, నలోపాఖ్యానము మొదలైనవి ముఖ్యములు. వీనితో సమానమైనవి కచదేవయాని కథ, ఉదంకుని కథ మొదలైనవి. ఈ యుపాఖ్యానము లకు గల సహజ సిద్ధమైన రామణీయకము నన్నయ ప్రదర్శించిన "ప్రసన్నత"తో ఇనుమడించినది.

తరువాతి గుణము "నానారుచిరార్థ సూక్తినిధి"త్వము. నన్నయ తాను వ్రాసినంత మేరకు పెక్కు తావులందు రుచిరార్థములైన సూక్తులను ప్రవేశపెట్టియున్నాడు. ఈ సూక్తులు కథకు అనుసంధింప బడి యున్నను విడిగా (ముక్తకముల వలె) కూడా ఉపయోగిం పబడుటకు వీలున్నవి. సూక్తులనగా కేవలము సుభాషితములనే కాక సామెతలు, నానుడులు, జాతీయములు, నీతిబోధక వాక్యములు వంటి వానిని కూడా నన్నయ తన రచనయందు అలవోకగా చొప్పించినాడు. కొన్నిటిని మాత్రము పరిశీలించిన-

1. ప్రల్లదుండైనయొక్క కులపాంసను జేసిన దాన దత్కులం బెల్లను దూషితంబగుట యేమి యపూర్వము ....(ఆది 1 - 125)
2. మతి దలంపఁగ సంసారం / బతి చంచల(ము) ...... గత కాలము మేలు వచ్చు కాలము కంటెన్ (ఆది - 1 - 159)
3. మనమునకు బ్రియంబును హిత / మును...... పలుకునది ధర్మయుతముగ సభలన్ (ఆది - 3 - 205)
4. క్రోధము తపముం జెఱచును ..... (ఆది - 2 - 172)

ఇంకను అనేక పద్యములు "నుతజల పూరితంబులగు", "ఎఱుక గలవారి చరితలు", "తన యెఱిగిన యర్థం బొరు / దనఘా" వంటివి గలవు.

ప్రసన్నతాలక్షణము కేవలము 'సారమతు'లై పరిశీలించిన విద్వజ్జనులకు మాత్రమే గ్రాహ్యమైనను, అన్యులు అక్షరరమ్యతను, నానారుచిరార్థ సూక్తినిధిత్వమును గ్రహించి ఆనందించవచ్చును.

చివరి లక్షణము - జగద్ధితము. కావ్యము విశ్వశ్రేయమునకే అని నమ్మిన నన్నయ తన భారతము నిండా వీలున్న తావుల యందు వేదోపనిషద్వివరణములు, సూక్తులు, ధర్మములు, ఆచారములు, తదితర సమాజ శ్రేయస్సునకుపకరించు కర్తవ్యములను హత్తుకొనే రీతిలో చెప్పిన, చెప్పించిన సందర్భాలను కొల్లలుగా గమనింపవచ్చును.

ఈ లక్షణాలనన్నింటినీ నన్నయ రాబోవు కవులకొరకు నిర్దేశించి నప్పటికీ తనలో అంతర్నిహితంగా ఉన్న వినయసౌభాగ్యము చేత తన కవిత్వములోనే నిర్వహించి తాను చేసినది "సర్గ"గాను, అనంతర కవీంద్రులది "ప్రతిసర్గ"గాను అప్రయత్నం గానే నిరూపించినాడు. ఈ పద్యము ఉత్తమపురుషలో లేదు. "నన్నయ భట్టు....రచన బందురుడయ్యె" అని ప్రథమపురుషలో చెప్పుటచేత కూడా నన్నయ భావికవులకు అహంకారము కూడదని పరోక్షముగా నిర్దేశించినట్లైనది.

- అన్నమరాజు ప్రభాకరరావు



గురు వందనం

పద్యపరిమళం

- ఆచార్య మల్లాప్రగడ శ్రీమన్నారాయణమూర్తి

వెలుగు మరొక్క పే రఖిల విద్యలకున్ పరమార్థభూతమై
వెలుగులు తన్ను మించి మరి విశ్వమునందున వేఱుచోట లే
వలఘుడు శిష్యవత్సలుడు నంబుధిశోషణ దాహమూర్తి వె
ల్గులనిధికిన్ గురూత్తమునకున్ జగదక్షునకున్ నమస్కృతుల్.

'కవి సమ్రాట్' విశ్వనాథవారి "రామాయణ కల్పవృక్షం"లో 'సుందరకాండ' లోని ఆరంభ పద్యం ఇది.

సీతాన్వేషణకై సముద్రందాటే ప్రయత్నం చేయబోతూ హనుమ చేసిన గురు స్తుతి ఇది.

హనుమంతుడు సూర్య శిష్యుడు కనుక, ఇది సూర్యారాధన స్తోత్రం. మూలంలోని 'స సూర్యాయ....అంజలిం కృత్వా...." అనే వాక్యం ఆధారంగా విశ్వనాథ వారి హనుమంతుడు విశదంగా చేసిన గురు ప్రార్థన ఈ పద్యం.

భారతీయ సంప్రదాయంలో వెలుగు జ్ఞానానికి ప్రతీక. ఈ లోకంలోని అఖిల విద్యలకూ పరమార్థం జ్ఞాన సముపార్జనమే.

'అఖిల' విద్యలు అంటే అన్ని విద్యలూ అని మాత్రమేకాదు, 'శాశ్వతత్వాన్ని ప్రసాదించే విద్యలు' అని కూడా భావించవచ్చు. అంటే ఆధ్యాత్మిక విద్యలే. పొట్టకూటి చదువులన్నీ 'ఖిలమై' పోయే విద్యలే. వాటికి శాశ్వతత్వం ఎక్కడిది? వాటి పరిధి, ప్రయోజనం పరిమితం కదా! బ్రతుకు తెరువుతోపాటు బ్రతుకు పరమార్థాన్ని కూడ ప్రసాదించగల విద్యలే నిజమైన వెలుగులు.

మానవాంతరంగంలో అజానాంధకారాన్ని పారద్రోలి, జ్ఞానకాంతిని ప్రసరింప చేసేవే 'అఖిల' విద్యలు.

వెలుగులకు వెలుగైన వేవెలుగు సూర్య భగవానుడు. వెలుగు అతడికి మరో పేరు. శిష్యుల హృదయంలో అవిద్యా తిమిరాన్ని తొలగించి, విద్యా దీప్తిని కలిగించి, లో వెలుగును అనుగ్రహించే గురువు లందరూ సూర్యునివంటి వారే.

అయితే, హనుమకు సూర్యుడే ప్రత్యక్షంగా గురువు. భౌతికంగా వెలుగు, హృదయంలో జ్ఞానదీప్తి- ఈ రెండురూపాలలో విశ్వ మంతటా వ్యాపించిన వెలుగే సూర్యుడు. వెలుగు నాలుగు విధాలుగా ఉంటుందని మన పెద్దలు సెలవిచ్చారు.

మొదటిది భౌతిక(బాహ్య)మైన వెలుగు. రెండవది హృదయం లోపలి జ్ఞానమనే వెలుగు. అంతవరకు మనకు తెలియని ఓ కొత్త విషయం మనం తెలుసుకున్నప్పుడు ఆ విషయంపట్ల మన మనస్సులో ప్రసరించే కొత్త వెలుగు మూడవది. తన ఆలోచనా పరిధి విస్తృతమై, ఒక విజానశాస్త్రవేత్త నూతన అంశాలను ఆవిష్కరించటం నాలుగవదైన వెలుగు.

ఇలా ఉన్న నాలుగు విధాలైన వెలుగులూ మనకు ప్రసాదించేది గురువే. హనుమకు ఆ గురువు సూర్యుడే.

భౌతికంగా కనిపించే వెలుగు మనకంటికి వస్తువులను చూపిస్తుంది. జ్ఞానమనే వెలుగు మన మనస్సుకు సరియైన అవగాహనను కలిగిస్తుంది. భౌతికమైన వెలుగును ప్రసారంచేసే సూర్యుడే హనుమకు జ్ఞానమనే వెలుగును ప్రసాదించే విద్యా ప్రదాత కూడా. అందుకే, "వెలుగులు తన్ను మించి మఱి విశ్వమునందున వేఱుచోట లేవు" అని సూర్యుణ్ణి ప్రస్తుతిస్తున్నాడు హనుమ.

తన గురువైన సూర్యుడు 'అలఘుడు' అన్నాడు విశ్వనాథవారి హనుమ.

తన గురువు ఎంతో గొప్పవాడు. అసాధారణ ఘనకార్యాలు నిర్వహించగలడు. సృష్టి ప్రారంభమైన నాటినుండి నేటివరకు ప్రతినిత్యమూ తూర్పు- పడమరల మధ్య అవిశ్రాంతంగా ప్రయాణిస్తూనే ఉన్నాడు. అయినా, అలసట లేదు. వన్నె వాసీ ఏ మాత్రమూ తగ్గలేదు. సెలవులు లేవు సరికదా, ఒక్కనాడైనా ఆ ప్రయాణంలో ఆలస్యం కూడా లేదు. విధ్యుక్త ధర్మ నిర్వహణలో 'సమయ పాలనం' అసిధారా వ్రతంగా పాటిస్తున్నాడు సూర్యుడు. కనుక **"అలఘుడు"**.

ఇప్పుడు హనుమ కూడా 'అలఘు' కార్యం ఒకటి సాధించవలసి ఉన్నది. వంద యోజనాల సముద్రాన్ని ఒకే ఒక్క గంతువేసి దాటాలి. ఆవలి తీరానికి చేరాలి. అంతటి బృహత్తర కార్య సాధనకు కావలసిన మహత్తరమైన శక్తిని సూర్య భగవానుడు హనుమకు ప్రసాదించాలి. 'అలఘుడైన' తన గురువు తనకూ 'అలఘు'త్వాన్ని అనుగ్రహిస్తాడని హనుమకు గట్టి నమ్మకం.

ఎంత అలఘుడైతే మాత్రం ఆ సూర్యుడు తన శిష్యుడైన హనుమకు అలాంటి శక్తిని ప్రసాదిస్తాడని నిశ్చయం ఏమిటి? అని మన ప్రశ్న. 'అలఘు'డైన తన గురువు 'శిష్య వత్సలుడు' కూడా అని హనుమ సమాధానం.

శిష్యవాత్సల్యంగల అలఘుడైన ఆ గురువు తనను తప్పక సముద్రం దాటింప చేస్తాడని హనుమ నమ్మకం. ఒకవేళ తనకు శక్తి చాలక, తాను దాటలేకపోయినా, తనకు దిగులు లేదు- అంటున్నాడు హనుమ. తీక్ష్ణమైన కిరణాలతో తనగురువైన సూర్య భగవానుడు ఆ సముద్రజలాలను పీల్చివేసి, తనకు సహకరిస్తాడు. తనను కనికరిస్తాడు. తన గురువైన సూర్యుడు "అంబుధిశోషణ దాహమూర్తి" అన్నాడు అందుకే.

సంసార సాగరాన్ని దాటటానికి కావలసిన జ్ఞాన దీప్తినే తనకు

(మిగతా 11వ పేజీలో)



కాశీలో దర్శనమ్ అవధాన సప్తకం
'శతావధాని' నారాయణం బాలసుబ్రహ్మణ్యం గారి అష్టావధానం

27.07.2025

సంచాలకులు – ఎం.వి.ఎల్.ఎన్. ప్రసాదు (కడప)

నిషిద్ధాక్షరి :– పాతూరి సుబ్రహ్మణ్యకవి (తెనాలి)

ఈఅవధానం గురించి సభాసదుల భావన.

శ్రీ(క)ద(మ)ంబై(–)భ(వ)ద్ర(–)ంబై
(శ)నాద(వ)శ్రీ(ల)తోన్(–)వె(స)లు(–)ంగు న(ట)
వ్య(మ) ప(ద)ధ(శ)ంబై

కం. శ్రీదంబై భద్రంబై
నాదశ్రీతోన్ వెలుంగునవ్యపథంబై
వేదాత్మకు సత్సభలో
మోదంబే వరలుచుండె పుణ్యదమగుచున్.

సమస్య :– దుర్భా కౌండిన్యశాయి. (తెనాలి)

చెడుగుణములు గలుగువాడు చెందును శుభముల్.

కం. అడుగడుగున దయతోడను
నడవడికను మంచి నిల్పి నాణెము మీరన్
కడుపుణ్యముజేసెడు మిం
చెడుగుణములు గలుగువాడు చెందును శుభముల్.

దత్తపది :– యం. వి. సోమేశ్వర్లు. (హైదరాబాద్)

మహదేవ, దండపాణి, కాలభైరవ, అన్నపూర్ణ
వీరు తిరుమల దర్శిస్తే వీరి భావన – స్వేచ్ఛాఛందం

తే.గీ. అన్నపూర్ణకు నుద్ది యాహార శాల
హనుమ కోదండపాణికి ననుగుబంటు
అరయ మహదేవు డీశుండె అచ్యుతుడని
కాలభైరవుడచ్చట గాంచి పలికె.

పురాణ పఠనం:– యన్.వి.యస్. మూర్తి. (ఏటూరినాగారం)



వర్ణన :– ఏ. శ్రీనివాస మారుతి. (మచిలీపట్నం)

భార్య చేతిలో హతమైన భర్త తదితర వార్తలు, స్త్రీల ఆలోచనలలో వచ్చిన మార్పుగురించి – స్వేచ్ఛా ఛందంలో.

తే.గీ. మార్పు సాజమ్ము ధరణిలో మనుజ తతికి
మార్పు లేకున్న జగతిలో మనగ లేము
అరయ వ్యత్యస్త మయ్యెడి నాలు మగల
పాత్రలయ్యవి లోకాన పరిధి దాటి.

వ్యస్తాక్షరి:– దుర్భా వాత్సల్య. (తెనాలి) 14అక్షరాలు

భారతీ దేవి మిము గాచు భద్రగతిని.

ఆశువు :– భువనగిరి పురుషోత్తం. (హైదరాబాద్)

1. కాశీ విశ్వ నాథుని వైభవం. వృత్తపద్యం

శా. కాశీక్షేత్రము దివ్యధామమిచటన్ గళ్యాణ సన్మూర్తి తా
నీశుండిమ్ముగ విశ్వనాథుడయి సుమ్మెంతేవిశేషమ్ముగా
రాశీభూతములైన పాపములతో రాగిల్లు జీవాళికిన్
క్లేశంబుల్ హరియించి బ్రోచునిపుడే లీలావినోదమ్ముగన్.

2. భాషాసేవ చేస్తున్న "మరుమాముల సోదర ద్వయం"

కం. మరుమాముల సోదరులకు
విరిదండలు వేయవలయు విస్తారముగా
సరియన్నది లేనియటుల
సరగున నడిపిరి వధాన సప్తక మిటులన్.

అప్రస్తుతం :– యం.కృష్ణ కిషోర్. (ధూళిపూడి)





డా. మారేపల్లి వేంకటరమణ పట్వర్ధన్,
శతావధాని గారి 134వ అష్టావధానం

23.092025, బ్రాహ్మణసంఘ భవనం, చెన్నూరు
జిల్లా: మంచిర్యాల.

సంచాలకులు:– జక్కేపెల్లి నాగేశ్వరరావు



1.నిషేధాక్షరి :– వేదాంతం సురేశ్ దేవీ మాహాత్మ్యం

కం. (శ్రీ (వ)శా(ర)బ్దిన్ (వా)దు(ర)ష్ట(హ)ఘ్నన్
రా)గ్లేశాంతన్ (ద)బూ(ర)జ్య భ(ద)వ్యకీ(ర)లన్ దే(వ)జో
(రా)కోశన్ (మా)గొ(ప)ల్తున్ (బ్రే(మ)ష్టిన్
(ల)గాశన్ మా(త)యన్(మ) సు(ర)ప(ద)థ(గ)నుగా నేన్
మా(తా)యీ!

కం: (శ్రీ శాబ్దిన్ దుష్టఘ్నన్
గ్లేశాంతన్ బూజ్య భవ్యకీలన్ దేజో
కోశన్ గొల్తున్ (బేష్టిన్
గాశన్ మాయన్ సుపథనుగా నేన్ మాయీ!

సమస్య:– దండనాయకుల వామనరావు
మలమున వ్రాలుచు భ్రమరము మధువున్ గ్రోలెన్.

కం. సలలిత పరిమళ రాగా
మల కాంక్షను జూపి సమద మానసమొప్పన్
మలయానిల చలిత శుభక
మలమున వ్రాలుచు భ్రమరము మధువున్ గ్రోలెన్

దత్తపది:– కొమ్మెర సౌజన్య
భారతి, విమల, వినయ,శారద అనే పదాలతో అమ్మవారి ప్రార్థన

ఉ. భారతి నిన్ను గొల్తు బ్రతిభారతి మానసమందు నిష్ఠ చె
న్నూరను నీపదాబ్జముల నుండెద నే విమలాత్మతోడ, ధీ
సారమొసంగవే వినయచాలిత బుద్ధిని నన్ను జూడవే
శారద! సత్కళా నిచయసంభవ! యీ యవధాన వేళలో.

వర్ణన:– జక్కేపల్లి ముక్తేశ్వరరావు అంగనల హారతి

ఉ. హారతి స్వీకరించుము మహామహితాత్మ మహేశ ప్రీతితో
హారతి స్వీకరించుము శుభాస్పదదివ్య చరిత్ర మ్రొక్కెదన్
హారతి స్వీకరించుము హిమాచల భవ్యసుతా మనోహరా!
హారతి నిత్తు నీకిదియె హారి మహోరగ దివ్యభూషణా!

న్యస్తాక్షరి:– శ్రీరాంభట్ల శ్రీనివాసశర్మ 1–3–శు, 2–8–భ, 3–10–రా,4–16–త్రి, ఉత్పలమాలలో దేవీస్తుతి

ఉ. బాల! శుభాస్పదా! సకల భవ్యమనోజ్ఞసువర్ణ మూర్తివై
లాలనసేసి,శ్రీ శుభములన్ దయసేయగదమ్మ తల్లి రో!
వ్రాలెద నీ పదాబ్జముల రాగమునన్ మహిమైక చరితా!
బాలుడనమ్మ నీకృపకు బాత్రుడ నమ్మరో! త్రిస్థ! సద్గుణా!

(7వ పేజీ తరువాయి) **గురువందనం**

ప్రసాదించగల తన గురువు ఈ చిన్న సముద్రాన్ని దాటేలా తనను అనుగ్రహించడా! అన్నది హనుమ ధీమా. అంతటి గురువు తనకు ఉన్నందువల్ల ఇక తనకు చీకటి ఉండదు. తన గురువు "వెల్గుల నిధి" కదా! అన్నది హనుమ ఆలోచన.

ఈ సాగరాన్ని దాటితే, తనకు సీతా సందర్శన భాగ్యం. గురుకటాక్షంతో సంసార సాగరాన్ని దాటగలిగిన శిష్యుడికి లభించేది 'వెలుగుల నిధి'.

అంటే అపారమైన జ్ఞాన సంపద.

లంకలో ఉన్న సీత

'వెలుగుల నిధే' కదా!

వెలుగుల నిధి అయిన 'అమ్మ'దర్శనం తనకు కలిగించే సూర్యుడు "గురూత్తముడు".

ఐహిక ఆముష్మిక లాభాలను రెండింటినీ తనకు అనుగ్రహించే ఆ గురువు "గురూత్తముడే" కదా!

ఒక్క తనకే కాదు, సమస్త లోకాలకూ వెలుగుదారి చూపించే 'జగదక్షుడు' సూర్యుడు. "చక్షో స్సూర్య అజాయత" అనే మంత్రంలో విరాట్పురుషుడి నేత్రాలనుంచి సూర్యుడు ఆవిర్భవించాడని వేదం చెప్తోంది. కనుక, విశ్వంలోని ప్రాణు లందరికీ కన్ను ఆ సూర్యుడే.

మన కంటిలోని రెటీనా పవర్ సూర్యునివల్లనే పనిచేస్తోందని విజ్ఞాన శాస్త్రం కూడ గుర్తించింది.

"నమ స్సవిత్రే జగదేక చక్షుషే."

అనే ప్రార్థన మనకు సుపరిచితమే. జగచ్చక్షువైన ఆ సూర్యుడే విశ్వనాథవారి విలక్షణ పద ప్రయోగంలో

"జగదక్షుడు" అయ్యాడు.


"స సూర్యాయ..." అని వాల్మీకి మహర్షి సూచించిన ఒకే ఒక్క పదం సూర్య బింబ మైతే, అందలి వెలుగు కిరణాలే ఈ పద్యంలో విశ్వనాథ ప్రయోగించిన విశేషణాలు.

అలాంటి జగదక్షుడైన గురువుకు మనమూ మనసా శిరసా నమస్కరిద్దాం.





అవధానికి నిఘంటు పరిచయం మాత్రమే సరిపోదు, అందులో లోతైన పరిజ్ఞానం ఉండాలి. పదానికి అర్థాన్ని తెలియజేసేది నిఘంటువన్నది ప్రాథమిక అవగాహన. ఆ పదం దీర్ఘాంతమా? హ్రస్వాంతమా? స్త్రీలింగమా? పుంలింగమా? మొదలైన విషయాలతో పాటు అది నామవాచకమా? సర్వనామమా? అనే విషయాన్ని కూడా నిఘంటువు తెలియజేస్తుంది. ఆ వివరాలు తెలియకుండా పదాన్ని ప్రయోగిస్తే శాబ్దిక, ఆర్థిక దోషాలు కలుగుతాయి. కొన్ని చోట్ల అతివ్యాప్తి, అవ్యాప్తి దోషాలు కలుగడమే కాక ఔచిత్యభంగం కూడా వాటిల్లుతుంది. నిర్దోషంగా కవిత్వం చెప్పడం, కావ్యశాస్త్ర సిద్ధాంతాల ప్రకారం పద్యమల్లడం అవధాని ప్రథమ కర్తవ్యం.



అమరకోశ ప్రవేశిక

అమరకోశం విషయసంబంధ క్రమమున్న నిఘంటువు. ఇది మొదటి స్వర్గ వర్గముతో మొదలవుతుంది.

స్వరవ్యయం స్వర్గనాక త్రిదివ త్రిదశాలయాః
సురలోక ద్యోదివౌ ద్వేస్త్రియాం క్లీబే త్రివిష్టపమ్ ॥ (ప్ర.కాం.6)

ఈ శ్లోకంలో స్వః అను పదం అవ్యయం, స్వర్గ, నాక, త్రిదివ, త్రిదశాలయ, సురలోక శబ్దములు అకారాంత పుంలింగములు, ద్యో, దివ్ శబ్దములు రెండూ స్త్రీలింగములు, త్రివిష్టపమ్ నపుంసకలింగం. మొత్తం తొమ్మిది పర్యాయపదాలు, వాటి లింగాలు కలిపి ఒకే శ్లోకంలో చెప్పబడినవి. ఈ నిఘంటువులోని సౌలభ్యమిదే. అందుకే దీనిని పఠనపాఠనాలలో విస్తృతంగా వాడుతారు. తరువాత స్వర్గంలో నివసించే దేవతల పర్యాయ పదాలు 25 కేవలం మూడు శ్లోకాలలో చెప్పబడినవి. తర్వాత గణదేవతలు, దేవయోని భేదాలు, వారి విరోధులైన రాక్షసుల పేర్లు, పిమ్మట ఇంద్రాది దిక్పాలకుల పేర్లు, వారి పరివారాలు, ఆకాశము, ఆకాశంలోని చంద్ర, నక్షత్ర గణాలు, గ్రహాలు, గ్రహాధిపతి సూర్యుడు, తర్వాత పాతాళం, అక్కడ నివసించే నాగాదులు, సముద్రం, అందలి జలచరాల పేర్లతో ప్రథమ కాండం ముగుస్తుంది.

అమరకోశంలో మొత్తం 1469 అనుష్టుప్ శ్లోకాలున్నాయి. ప్రథమ కాండలో 282 శ్లోకాలున్నాయి. ఇక ద్వితీయ కాండము లోని 726 శ్లోకాలు భూలోక విషయ సంబంధమైనవి.

భూర్భూమి రచలానన్తా రసా విశ్వమ్భరా స్థిరా ।

ధరాధరిత్రీ ధరణిః క్షోణిర్జ్యా కాశ్యపీక్షితిః ॥ అంటూ భూమికి గల 27 పేర్లను అమరం పేర్కొని అటుపై భూసంబంధమైన పర్వత, వన, ఔషధ, పుర, మృగాది ప్రాణులను గూర్చి చెబుతుంది. ఆపై బ్రాహ్మణ క్షత్రియాది జాతులు, వృత్తులు, తెలియజేయు పదములున్నవి. ఈ విధంగా నిఘంటుకారుడైన అమరసింహుడు ఈ వర్గ విభజన చక్కని ప్రణాళికతో చేసి ఉన్నాడు.

మొదటి రెండు కాండలలో చెప్పిన విషయాలు, విశేషణాలు, నానార్థాలు, తృతీయ కాండలో చేర్చబడినవి. నామవాచకములతో సమాన లింగాలు గల విశేషణాలను విశేష్యనిఘ్నవర్గంలో పేర్కొన్నాడు. ప్రకృతి ప్రత్యయార్థములచే లింగభేదము ఏర్పడిన శబ్దములను సంకీర్ణ వర్గంలో తెలియజేశాడు. తరువాత నానార్థములు, అవ్యయములు, నానార్థావ్యయ వర్గంలో పేర్కొన్నాడు. నానార్థవర్గంలో అమరసింహుడు పదములను 'క' నుండి 'హ' వరకు గల అంత్య వర్ణముల క్రమములో కూర్చినాడు.

ఉదా: **ఆకాశే త్రిదివే నాకః లోకస్తు భువనేజనే ।**
పద్యేయశసి చ శ్లోకః శరే ఖడ్గే చ సాయకః ॥

ఇందులోని నాక, లోక, శ్లోక, సాయక అనునవి కాంతపదములు. నాక శబ్దమునకు పద్యము, కీర్తియని; సామక శబ్దమునకు బాణము, ఖడ్గమని నానార్థములు.ఇది పాఠక సౌలభ్యమైన రచన. ఇక్కడి వరకు లింగవచన విభక్తి ప్రత్యయములు గల పదాలను చెప్పిన అమర సింహుడు అటుపై అవిలేని అవ్యయాలను చెప్పాడు. వాటిని కూడా నానార్థావ్యయాలు, ఏకార్థావ్యయాలని విభజించాడు.

ఉదా: స్వస్త్యాశీః క్షేమ పుణ్యాదౌ – స్వస్తి శబ్దము అవ్యయము. దీనిని ఆశీర్వాదమందు, నిరుపద్రవమందు, పుణ్యమందు, శుభమందు ప్రయోగిస్తారు. ఇది నానార్థావ్యయము.

ఉదా: ముహుః పునః పునశ్శశ్వ దభీక్ష్ణ మసకృత్సమాః

ముహుః, పునఃపునః శశ్వత్, అభీక్ష్ణం, అసకృత్ అనే ఈ 5 అవ్యయములకు 'మాటిమాటికి' అని అర్థము.

అమరకోశమునకు నామలింగానుశాసనమని కూడా పేరు. ఈ లింగానుశాసనము కొరకు లింగాది సంగ్రహవర్గము నిఘంటువు చివర చేర్చబడినది. అయితే పూర్వ కాండలలో విశేషంగా చెప్పబడిన లింగమునకు ప్రాధాన్యమని చెప్పి సందేహాన్ని పరిహరించాడు. అనగా దీనిలో స్వర్గపర్యాయ పదములు పులింగములని చెప్పబడినది. అది 'క్లీబేత్రివిష్టపమ్' అనుదానిని బాధించదు. అనగా త్రివిష్టప పదం ప్రథమకాండలో పేర్కొన్నట్లు నపుంసకలింగమే అవుతుంది. మిగిలిన వాటిని ఇట్లే గ్రహించాలి. ఈ కారాంత, ఊకారాంతములైన

(మిగతా 22వ పేజీలో)



పూరణతోరణం

నిర్వహణ: 'అష్టావధాని' కంది శంకరయ్య

సమస్య

"కన్నవారలఁ గాంచినంతనె గౌరవించుట దోషమా"

1. డా. జంధ్యాల సుబ్బలక్ష్మి

ఎన్నగా పసిబాలలన్ నడిపించు బాధ్యత లేకయే
మిన్ను మన్నుల మధ్య గల్గిన మేటి వస్తుల నిచ్చి సం
పన్నతన్ భ్రమియింప జేయుచు భ్రష్టులం బొనరించు నా
కన్నవారలఁ గాంచినంతనె గౌరవించుట దోషమా.

2. కవుతా రామకృష్ణ

నన్నపార్యున కుజ్జియౌ కవినాథుడైనను, ప్రీతితో
నెన్నికై భరతోర్వినేలు నరేంద్రుడైనను, సృష్టిలో
గన్నతల్లిని మించడెవ్వడు కాన, నొప్పులనోర్చి తాఁ
గన్నవారలఁ గాంచినంతనె గౌరవించుట దోషమా.

3. కోటంరాజు లలితా పరమేశ్వరి, ఉప్పల్

ఉన్నదంతయు నూడ్చి బిడ్డల నున్నతంబుగ బెంచి, నే
డన్నమో రఘురామ యంచును ఠావు దప్పిన వృద్ధులన్,
కన్నవారల నాశ్రమంబుల కంపుచున్న కుపుత్రులన్
గన్న, వారల గాంచినంతనే గౌరవించుట దోషమా.

4. చుక్కాయపల్లిశ్రీదేవి, మహబూబ్ నగర్

కన్నుమిన్నుల గాననేరక కాలకూట విషమ్ములై
చిన్నపెద్దల శీలమెంచని చిత్తవృత్తుల సాగుచున్
వెన్నుపోటులు దుష్టబుద్ధులు వేడుకైన దురాత్ములన్
కన్న, వారల గాంచినంతనె గౌరవించుట దోషమా.

5. డా. వేదాల గాయత్రీదేవి

మున్నుమున్నుగ నీదు శ్రేయము ముఖ్యమంచును గోరుచున్
వెన్ను దట్టుచు ప్రోత్సహించెడి విజ్ఞులై చరియించు, నీ
కన్నవారల గాంచినంతనె గౌరవించుట దోషమౌ
నన్నవారికి బుద్ధిసెప్పుమ యార్తి బాపగ వారికిన్.

6. పఠానేని 'విరించి' కార్తిక్, (విభీషణు వచ్చినప్పుడు లక్ష్మణుడు)

నిన్ను బాధను ముంచి జానకి నీకు దూరము సేసినా
డున్న పట్టున వాని తమ్ముడు యుద్ధమందున గుట్రతో
నిన్ను చంపు నిశాచరుల్ సుమి నీవె సర్వము మాకు ది
క్కన్న! వారల గాంచినంతనె గౌరవించుట దోషమౌ !

6. పెనుగొండ రామబ్రహ్మం, బెంగళూరు

దన్నుగా నటు తీర్చిదిద్దగఁ దల్లిదండ్రులు నిల్చినన్
మిన్నగానిలఁ బ్రేమఁ బంచఁగ మీఁదుమిక్కిలి తోషమౌ
నెన్నకుండఁగ సంతు బాధ్యత నెల్లకాలము సాగెడిన్
గన్నవారలఁ గాంచినంతనె గౌరవించుట దోషమౌ.

7. మాచవోలు శ్రీధరరావు, హైదరాబాద్

మిన్నగా చదివించి యెన్నడు మేలునే తలపోయుచున్
గన్నబిడ్డల వృద్ధిచేయగ, కర్కశమ్మగు బుద్ధితో
కన్న తల్లికి, తండ్రికిన్ గల కష్టముల్ వినుటే చిరా
కన్న వారల గాంచినంతనె గౌరవించుట దోషమౌ!

8. లంక శివరామకృష్ణ శాస్త్రి, హైదరాబాదు

కన్నుమిన్నును గానకుండగ కౌతుకమ్మున ధూర్తులై
యన్నదమ్ముల తల్లిదండ్రుల నక్కచెల్లెల నెంచు నా
దున్నపోతుల వంటివారిని దుర్మదాంధులు దుష్టులన్
కన్నవారలఁ గాంచినంతనె గౌరవించుట దోషమౌ.

9. విరించి, హైదరాబాదు

పిన్నవంచును చెప్పుచుంటిని పెద్దవారిని భక్తితో
సన్నుతించుట సంప్రదాయము సత్యమియ్యది సోదరా
కొన్నవారని యత్తమామల కూర్మి జూపుచు, వీడి నీ
కన్నవారల, గాంచినంతనె గౌరవించుట దోషమౌ.

10. సిరాశ్రీ, హైదరాబాదు

నిన్న మొన్నల నీతులెల్లను నీరు గారెను నేడిలన్
చిన్నబోయెను జీవమన్నది జీర్ణమవ్వగ జాతిలో
పిన్నవారికి పెద్దవారలు పెద్దదిక్కన నేరమౌ
కన్నవారల గాంచినంతనె గౌరవించుట దోషమౌ.

11. ఇరువంటి నాగ దుర్గా మాధురీ దేవి, హైదరాబాద్

కన్నవారల గాంచినంతనె గౌరవించుట దోషమౌ
నన్న మాటలు చేటుగూర్చును హ్లాదమేమన చూడగన్
వెన్న వంటి మనస్సుతో మన పేర్మి పంచిన చాలు నా
మిన్నయైన గుణాంబురాశిని మించి యేదియు లేదిలన్.

12. కడియాల మధుసూదన రావు

కన్న పిల్లలు కోరినంతనె కారులన్ గొని యిచ్చినన్
కన్నుమిన్నులు గానకన్ కురకారు చేయు ప్రమాదముల్
కన్నులుండియు కట్టుచేయక గారమున్ తెగ జేయు నా
కన్నవారల గాంచినంతనె గౌరవించుట దోషమౌ!

13. కశోర్ఘుల నాగేశ్వర్ శర్మ, ధర్మపురి

కన్నుమిన్నును గానకుండగ కామకార్యము సల్పగా
కన్నబిడ్డను చెత్త బుట్టను కాంత! వైచితివెందుకో
తిన్నగేమియునెఱ్ఱనట్లుగ తీరు జీవనమెందుకో ?
కన్నవారలఁ గాంచినంతనె గౌరవించుట దోషమౌ.

14. కొరిడె విశ్వనాథ శర్మ, ధర్మపురి

చిన్ననాటనె పిల్లవాడిని చిన్న తప్పులు చేయగా
వెన్ను తట్టుచు ప్రోత్సహించుచు చేయుమింకనికోరుచున్



కన్నవాడినె పేరు గాంచిన కల్లరీడుగ మార్చు యా
కన్నవారలఁ గాంచినంతనె గౌరవించుట దోషమా.

15. గుండా వేంకట సుబ్బ సహదేవుడు, ప్రొద్దుటూరు

ఉన్నవారలు భోజనాలకు నూరి వారల బిల్వఁగన్
మిన్నగుండును వేడ్కటంచును మీరి రాగ జనంబు, పే
రెన్ని కొందరినెంచ పెద్దగ నేకపక్షపు వద్దనన్
కన్నవారలఁ గాంచినంతనె గౌరవించుట దోషమా!

16. జనమంచి ఫణీంద్ర, రాజగోపాల్ పేట

ఎన్నరానటువంటి కష్టములీయనెంచెడివారినిన్
తిన్నయింటికి వాసముల్ గణుతించ బోయెడి వారలన్
అన్నదమ్ముల అత్తమామల నాడిపోయుచుఁ చెంత రా
కన్నవారలఁ గాంచినంతనె గౌరవించుట దోషమా

17. డా. ఎం. పురుషోత్తమాచార్య, రామగిరి, నల్లగొండ

కన్నవారిని హింసపెట్టుచు, కాసుకై తపియించుచున్,
ఉన్నతంబగు పీఠమెక్కి, మహోగ్రరీతిగ పేదలన్
ఎన్నొ పీడల పాలుసేయుచు, హేయదౌష్ట్యపు కీరితిన్
కన్నవారల గాంచినంతనే గౌరవించుట దోషమా.

18. డా. బోరెల్లి హర్ష, కర్నూలు

కన్నవారల గాంచినంతనె గౌరవించుట దోషమా
చిన్నప్రాయము నుండి విద్యను స్నేహమిచ్చిన సంద్రమై
వెన్నుదన్నుగ నన్నివేళల వెంటనుండగ నిల్వగన్
పెన్నుగాను కలెక్టరై కడు పేరుబొందిన పుత్రుడిన్
కన్నవారలఁ గాంచినంతనె గౌరవించుట దోషమా

19. డా. వరలక్ష్మి హరవే, బెంగుళూరు

చిన్ననాటను సేవచేసిరి చింతవంతల వీడియే
చిన్న నోటను గోరుముద్దలు చిన్నగా తినిపించిరే
అన్నుమిన్నును గానకుండియు నాదరించక బోదువే
కన్నవారలఁ గాంచినంతనె గౌరవించుట దోషమా ?

20. తపస్వి, విజయవాడ

అన్ని రీతుల భార్యకెప్పుడు హాయి గూర్చగ చూచుచున్
మున్నునుండిన మాటతీరును పూడ్చిపెట్టుచు నిత్యమున్
సన్నగిల్లుచు ధైర్యమంత యశాంతి నిండగ పత్నితో
కన్నవారల గాంచినంతనె గౌరవించుట దోషమా.

21. ధనికొండ రవిప్రసాద్, హైదరాబాదు

నన్ను, నీ యవధానిన్, కవనమ్ము నందున దిట్టనౌ
నన్ను గానక విద్య లేకయె నాల్గు మాటలు నేర్చియున్
చిన్న భాషణ లిచ్చు వారిని చేర దీసిరి మెచ్చి? నా
కన్నవారలఁ గాంచినంతనె గౌరవించుట దోషమా"

22. నుదురుపాటి లలిత

అన్నె పున్నె మెరుంగ కాడెడి యంకురంబుల దెంచుచున్
మిన్ను మీరిన వాంఛలూగగ మేటి దుర్భర జీవులున్
వన్నెలాటల బాటలన్ బడి వారి బిడ్డ లనాథులై
గన్నవారల కాంచి నంతనె గారవించుట దోషమా.

23. పి.ఎల్. నాగేశ్వరరావు, హైదరాబాదు

చిన్ని బిడ్డను చీత్కరించుచు శీఘ్రమేనట నమ్మగా
నున్నతంబగు కొల్వునందగ నోర్పుతో సుత నేర్పుగా
దన్ను జూడగఁ దల్లిదండ్రులుఁ దామె రాగ ధనాశతో
గన్నవారలఁ గాంచినంతనె గౌరవించుట దోషమా!

24. బొలిశెట్టి సత్యనారాయణ, హైదరాబాద్

అన్ని తీరుల నండ జూపెడి యాశ గొల్పియు నెంతయో
యెన్నికయ్యెడి నాటినుండియు యింగితంబును వీడుచున్
యున్నవన్నియు కొల్లగొట్టెడి యూహగూడిన స్వప్నముల్
కన్నవారలఁ గాంచినంతనె గౌరవించుట దోషమా.

25. మరింగంటి శ్రీనివాస్, హైదరాబాద్

మిన్నగా చదివించి పిల్లల మేలు గోరుచు, చేతిలో
నున్నదంతయు దోచిపెట్టిన నొప్పు కోకనుఁ గోపమున్
పిన్నలందరుఁ బెద్దవారిని వీధి బైటకు తోసిరే!
కన్నవారలఁ గాంచినంతనె గౌరవించుట దోషమా.

26. మాదుగుల నారాయణమూర్తి, ఆసిఫాబాదు

కన్నుమిన్నును గానకుండగ గర్వమందున దేలుచున్
వన్నె, సొమ్ములు మిన్న యంచును వైరమందున లోకమున్
పున్నెమెంచక హింస జేయుచు భోగమొందెడు దైత్యులన్
కన్నవారల గాంచినంతనె గౌరవించుట దోషమా.

27. మాదుగుల మురళీధర శర్మ, సిద్ధిపేట/కాళేశ్వరం

కన్నుమిన్నగ గర్వ మందుచు గార్దభంబుల రీతిగా!
కన్న తల్లియుఁ దండ్రి, సంతును కాలదన్నెడు ధూర్తులన్!
మిన్నకుండుచు, మేలుచేయుచు మిథ్యవాదిగ మారెడున్!
కన్నవారలఁగాంచినంతనె గౌరవించుట దోషమా!

28. రాకుమార, గోదావరిఖని

దున్నపోతుగ సంచరించుచు దుష్టచేష్టల బూనుచున్
మిన్నకుండెడి బుద్ధిమంతుల మీద నిందలు మోపగన్
చిన్న పెద్దలు నెల్ల జేరియు చీదరించెడు దుష్టుడిన్
కన్నవారల గాంచినంతనె గౌరవించుట దోషమా.

29. వాడపల్లి రాధ, హైదరాబాద్

కన్నవారల గాంచినంతనె గౌరవించుట దోషమా
నన్నవారిని దూరముంచుచు, హస్తముల్ జోడించుమా!
చిన్నవారుగ తల్లిదండ్రుల చిత్తముల్ గమనించుచున్
మిన్నగా నిక ధర్మవర్తన మెంచి కీర్తిని గాంచుమా!

సమస్య (పూరణలు 15 నవంబరు 2025 లోపు పంపాలి)
సరస మెఱుంగనట్టి పతి సన్నుతులందెను ధర్మపత్నిచే



దత్తపది

'అంగ - వంగ - గంగ - సంగ' ఈ పదాలను అన్యార్థంలో ప్రయోగిస్తూ ఉత్పలమాలలో భారతార్థంలో

1. డా. జంధ్యాల సుబ్బలక్ష్మి, హైదరాబాదు
(అంబతో భీష్ముడు)
అంగన! నీవు నన్యునకునై మనసిచ్చిన దానవౌట నీ
సంగతి తమ్ముగుఱ్ఱకు ప్రశస్తము కాదు యథేచ్ఛ పొమ్ము కా
వంగల వాడు సాల్వనరపాలుడు నీ విభు చెంత జేర నే
గంగ త్వదీయమానసవికాసము గల్గు త్రిలోక సుందరీ!

2. కవుతా రామకృష్ణ
సంధికి నంగలార్తురని జ్ఞాతుల దెప్పకు, నాశమౌను నీ
కంధినిఁ బోలుసేన యలుగంగఁ గిరీటి, నరేశ! హెచ్చ గ
ర్వాంధము సంగరంబునకు నఱ్ఱులుసాచకు, చంపి ముంచడే
సింధువునందు భీము డొకచేతను నీ కురువంగడమ్మునన్?

3. కోటంరాజు లలితా పరమేశ్వరి, ఉప్పల్
అంగన వేణి బట్టి సభ నందరు జూడగ నీడ్చుకొంచు బో
వంగ దురాత్ము డా యబల ప్రార్థన జేయగ కృష్ణ నంత వే
గంగనె వచ్చి చీరలిడి కాచెను సోదరి మానమున్ భళా
సంగతమెంత గొప్పదని చాలగ మెచ్చిరి కృష్ణ, కృష్ణులన్.

4. చుక్కాయపల్లి శ్రీదేవి, మహబూబ్‌నగర్
అంగడిబొమ్మయా? సభికులందరి ముందు పరాభవమ్ము సా
గంగ వివస్త్ర జేయగను కౌరవులా కుటిలంబు జూప, కా
వంగను నీవె దిక్కనుచు ప్రార్థన జేయ కృపాసముద్రుడా
సంగతి గాంచి కాచె హరి సన్నుతి జేసెడు ద్రౌపదిన్ త్వరన్.

5. జి. సావిత్రీ లక్ష్మణమూర్తి, సంగారెడ్డి
అంగన చీరయందు విలయాగ్ని వలెన్ కురురాజుపైన కు
ర్వంగ దొడంగెనో? యరుణ వైతరణీ ఝరిలోన తేలి ము
న్గంగ ముహూర్తమేమొ? కలకంఠి శిరోజము కాలపాశమో?
సంగతి చెప్పనేమి? ఘనసాధ్వుల దుఃఖము ముప్పెయౌ గదా!

6. డా. ఎం. పురుషోత్తమాచార్య, రామగిరి, నల్లగొండ
మానధనుండు కౌరవుడు, మాన్యుని కర్ణుని బిల్చి, అంగరా
జ్యానికి రాజు చేసె దరహాసములన్ మునుగంగ కర్ణునిన్,
దానికి కర్ణుడిట్లనె "సదా యిది నే మరువంగలేను, మి
త్రా! నిను గొల్చుచున్ బ్రదికెదన్ భవదన్వయమిత్రసంగతిన్"

7. డా. బోరెల్లి హర్ష, కర్నూలు
అంగన వల్వలూడ్చి పరిహాసము జేయ సుయోధనుం డభి
ష్వంగము గల్గి ద్రౌపదికి సైగల నంకము జూపి నవ్వ మ్రో
గంగ వృకోదరాగ్రహము గర్జన, భీముడు పల్కెనిట్లు "నే
సంగరమందు నీ తొడల సత్తువ దీరగ నుజ్జు జేసెదన్"

8. డా. వేదాల గాయత్రీదేవి
అంగనకున్ పరాభవము నార్తి నొసంగిన దుష్టచిత్తులన్
గంగ సుపుత్రు డేమనక గమ్మున నుండె సభాంతరమ్మునన్
వంగడమెల్ల నాశమగు, వైరమణంపగనేల! యిత్తరిన్
సంగరమే శరణ్యమని చాపధనుర్ధరు డర్జునుండనెన్.

9. తపస్వి, విజయవాడ
అంగములందు కంపనము నక్షువులందున నాగ్రహంబు పొం
గంగ సుయోధనాధముని గాంచుచు భీముడు పల్కె మూర్ఖుడా
సంగరమందు నీ తొడలు చప్పున చీల్చెద నీవికెప్పు లే
వంగను వీలు లేక పలు బాధలు పొందగ జీవితాంతమున్.

10. ధనికొండ రవిప్రసాద్, హైదరాబాదు
అంగజతాపమున్ బడసి, యర్జున నిన్ హృదయాన నిల్పి ము
న్గంగ వ్యథన్ సురాంగనను గానక వ్యర్థపు బల్కు లేల? నీ
వంగన నెవ్వతిన్ గనవె? యచ్చర లోకువ యయ్యె నేమి? నీ
సంగమ మొక్కటే మదికి శాంతి నొసంగును,రమ్ము రమ్మికన్.
(అని ఊర్వశి అర్జునుణ్ని రెచ్చగొట్టే ప్రయత్నం చేసింది.)

11. పఠానేని 'విరించి' కార్తిక్, హైదరాబాద్
అంగజ వైరితో విజయు డచ్చెరువొందుచు పోరు మీటి సా
గంగ శరాళి మాయమయి కచ్చను రేపగ వింటినెత్తి హృ
త్సంగత పౌరుషార్భటులు సంధిలి శీర్షముపైన కొట్టె, బ్రో
వంగ కిరాత వేషమును బాల శశాంక ధరుండు వీడెగా!

12. పెనుగొండ రామబ్రహ్మం, బెంగుళూరు
అంగన వస్త్రమూడ్చుటకు యత్నముఁ జేసిన నాఁటి యానలన్
వంగజ దిద్ది తీర్చఁగను బార్థుఁడు భీముఁడు నాజి సల్ప క్రుం
గంగను గౌరవాధములుఁ గ్రమ్మఁగ దుఃఖము నాంబికేయుఁడున్
సంగతి తెల్సి యేడ్చెనఁట సఖ్యత నేర్వకఁ గీడునొందరే!

13. బండకాడి అంజయ్య గౌడ్, హైదరాబాదు
అంగజుఁ గన్నతండ్రి! విబుధార్చిత గోపకిశోర! మమ్ము గా
వంగను నీవు సారథిగ పార్థు రథంబును ద్రోల చాలు నా
సంగరమందు కౌరవులఁ జంపియు రాజ్యము గొంచు మేము సా
గంగను ఛాయగా వరలు కంజదళాక్షుడ! నందనందనా!

14. ఇరువంటి నాగ దుర్గా మాధురీ దేవి, హైదరాబాద్
అంగడి బొమ్మ కాదు మహిమాన్వితమైనది యింతి పేర్మి సా
గంగ చరాచరాదులకు కామ్యము దీర్చెడి శక్తియై ధరన్
వంగగ నీయబోదు తప పల్కుల విల్లముతోడ కుంతియై
సంగమమే లిఖించునుగ సత్య జయంబుల గూర్చి భక్తితో.

15. కడియాల మధుసూదన రావు
అంగజుదేవి యందములు నాకసరాజు త్రినందనమ్ము వే
గంగ రథమ్ము నందు నిడి గంగ సుపుత్రుడు సాగ, కీర్తిపో
వంగను సేన యడ్డపడ బాణపరంపర నోడ జేసి, యా
సంగరమందు గెల్చి నెరజాణల తమ్ముని ముందు నిల్పగా!



16. గుండా వేంకట సుబ్బ సహదేవుడు, ప్రొద్దుటూరు

అంగన మాలినిన్ సరసమాడఁగ బిల్చియు నార్తితో పరి
ష్వంగమునందఁ బోవ కనుసైగల నర్తనశాల మేలు సా
గంగ ననంగ ముగ్ధుడయి కామమధాంత నవిజ్ఞుడౌచుఁ దా
సంగతమెంచఁగన్ వలలు జాలము కీచకుఁ గూల్చె నచ్చటన్.

17. గౌరీభట్ల అనిరుద్ధ శర్మ, జమిలాపేట్, హైదరాబాద్

రంగము చేయదల్చగ సరస్సున జారె సుయోధనుండు, న
వ్వంగ జనంబు చూడ నది, వారల నాపెను రాణి రాగ, వే
గంగనె తప్పు దోవ పడి గాంచెను నాసతి వెక్కిరింపుగా,
సంగతి తానెఱుంగక విషాగ్నగు కుట్రను తాను పన్నెనే

18. జనమంచి ఫణీంద్ర, రాజగోపాల్ పేట

సంగరభీకరమ్మదియె సారథి కృష్ణుడు చెంతనుండి గా
వంగను ధర్మమున్ జగతి వర్ధిలగా సుఖశాంతులన్ని, సా
గంగను జేసె జూపగను కవ్వడి, భీముల శౌర్యమంత నా
యంగన కృష్ణ దీక్ష గొన నాకురులన్ ముడివేసె శౌర్యతన్.

19. డా. చీదెళ్ళ సీతాలక్ష్మి, హైదరాబాద్

అంగన తోడుగా వనమునందున వెళ్లుచు నుండగాను పి
ల్వంగను రాక్షసాకృతియె వాయుసుతుండగు భీమసేనుడా
గంగను యా హిడింబి తనకాయము జుట్టుచు కౌగిలించెగా
సంగమమేనరణ్యమున చక్కని బిడ్డ ఘటోత్గజుండిలన్!

20. డా. రఘుపతి శాస్త్రుల

అంగన యైన ద్రౌపదిని నందరు చూచుచునుండ అట్లు నొ
వ్వంగగ జేసి నట్టి కురువంశపు క్రూరులు యుద్ధమందు నే
గంగగ ప్రాణముల్ వదలి కౌరవనాథుడు చూచెగాని ఆ
సంగరమాప గల్గెనె విచక్షణ కోల్వడు దుష్ట యోచనన్.

21. డా. వరలక్ష్మి హరవే, బెంగుళూరు

అంగనృపుండవై వెలుగు నందరు విస్తున చూచుచుండగా
వంగయు కోరనిచ్చెదను, వామపు భాగమ కౌరవేంద్రుకే
గంగకు సాక్షి భీష్ముడిట గాఢపు స్నేహపు బంధమేయనన్
సంగమ వేళ నైన నిక సంగర మందున వీడి పోములే.

22. నుదురుపాటి లలిత

అంగము మీరగన్ వినుత హేతువు భీష్మ పితామహాగ్రజున్
వంగము వీడ్క ధీరునిగ పంచమ వేదపు కావ్య రత్నమై
గంగకు మాటనిచ్చి విధి కత్తుల వేదిక నేతయై
సంగరమున్ కదున్విదిత శాంతన నామ విరాజితుండయెన్.

23. పి.ఎల్.నాగేశ్వరరావు, హైదరాబాదు

అంగన వల్వలూడ్చి పరిహాసము సేసిన కౌరవేంద్రుడే
గంగను దాగి చచ్చె పరకాంతను బొందగ జూడ బల్మితో!
క్రుంగెను కీచకుండు వడి క్రూరపు 'సంగతి వేడ్క'లందునన్
ముంగిట పత్నులుండనిటు పుట్టెడు పీడల వంగనెందుకో!

24. బొలిశెట్టి సత్యనారాయణ, హైదరాబాద్

కాంచియు యుద్ధ కౌశలము కర్ణుని జేసిరి 'అంగ' రాజుగన్
కాంచనదేశమున్ సరయు 'గంగ'ల 'సంగ'మ మధ్యభాగమున్
దించిరి యాగ స్ఫూర్తి గొని దీటుగ నెగ్గియు 'వంగ' భూపతిన్
మంచిగ యుద్ధరంగమను మారణహోమము నందు కౌరవుల్.

25. మాచవోలు శ్రీధరరావు, హైదరాబాద్

అంగన మాలినిన్ గొనఁగ, హాని యొసంగు సహోదరుండ! ప్రో
వంగ నినున్ విధాతయును పల్కగ నెంచదు! నీవు గంగ ము
న్గంగను వీడనట్టిదగు కల్మషమేల యొనర్ప నిట్టి వ్యా
సంగము చేర్చు దాపునకు చావునటంచనె నా సుధేష్ణయే!

26. మాడుగుల మురళీధర శర్మ, సిద్ధిపేట/కాళేశ్వరం

అంగకు రాజు కర్ణుడని యాప్తుడటంచును ధార్తరాష్ట్రుబీ చే
వంగ ని కర్ణుడార్తిగొని, వారిని, పాండవ వైరిగానుబీ వే
గంగ శరమ్ము వేయఁగనె కర్మఫలాశ్రితవత్సలాంగబీ స
త్సంగ ము, భారతమ్ము, నవభారత భావిత రాలదృష్టమౌ!

27. మార్తాటి ఈశ్వరీ గోపాల రావు, సింగరాయకొండ

అంగన! నన్ను సింహబలుడందురు మాలిని! నీవు పాడ వే
గంగరుదెంచి చూచితిని గారపు నీదగు మేని చాయ నీ
సంగముఁ గోరినాడ సరసంబగు నీయధరామృతంబు ద్రా
వంగ కుతూహలంబగు శుభాంగి! ననున్ గరుణించ రమ్మనెన్.

28. రాకుమార, గోదావరిఖని (దుర్యోధనునితో శకుని)

అంగబలంబుతోడ బహునర్థబలంబు వరించినంత మీ
వంగసకీర్తికిన్ శకుని పాచికలుండ నధైర్యమేలనో
గంగసుతుండు సంజయుడు గౌరవమొప్పగ కొల్వు దీరినన్
సంగడికాడు కర్ణుడును సౌఖ్యమొసంగు గదా సుయోధనా!

29. లంక శివరామకృష్ణ శాస్త్రి, హైదరాబాదు

గంగకు బుట్టినాడతడు కౌరవసేనకు పెద్దదిక్కుగా
సంగరమందు పాండవుల సైన్య సమేతుల చెండులాడిన
న్నంగములందు నాశుగములాయువు పట్లను చీల్చుచుండ గా
వంగని వీరుడైన పలు బాధలనొందెను భీష్మ డక్కటా.

30. సిరాశ్రీ, హైదరాబాదు

అంగన సిగ్గుతో నలిగి యార్తిగ చేతులనెత్తి యేడ్వగా
వంగని బాధతోబీ కురుసభాస్థలియందున దుష్టచర్య సా
గంగబీ పతీశ్వరుల్ కసిని, కచ్చను గుండెల నింపినట్టి యా
సంగతి చూపెనే కడకు సంగరమందున నెత్తుటేరులన్.

దత్తపది (పూరణలు 15 నవంబరు 2025 లోపు పంపాలి)
కరి - గిరి - దరి - సరి -- పదాలను అన్యార్థంలో
ప్రయోగిస్తూ గజేంద్రమోక్షవర్ణన, స్వేచ్ఛాఛందం



పద్యకవిత్వము సాధుప్రయోగాలు - 2

- 'అష్టావధాని' చిటితోటి విజయకుమార్



తత్సమ శబ్దాల సంధులలో సాధుప్రయోగాల గురించి తెలుసుకొనే ముందు కొన్ని ప్రారంభిక విషయాలు తెలుసుకోవాలి. పదాల మూలరూపాన్ని ప్రాతిపదిక అంటారు. మామూలుగా ప్రాతిపదికనే శబ్దం అంటుంటాం. ఈ శబ్దం చివర అచ్చు ఉంటే అజంత శబ్దం అనీ, హల్లు ఉంటే హలంతశబ్దం అనీ అంటాం. ఇంకా శబ్దం చివర సకారం ఉంటే సకారాంత శబ్దం అనీ, రేఫ ఉంటే రేఫాంతశబ్దం అనీ అంటాం. అయితే మొదటి పదం యొక్క మూలరూపంతో రెండోపదాన్ని కలిపి సమాసం చేయాలి. అప్పుడు మొదటిపదంయొక్క మూలరూపం(ప్రాతిపదిక) లోని చివరి అక్షరానికి, రెండో పదం యొక్క మొదటి అక్షరానికి సంధి జరుగుతుంది.

ఉదాహరణకు తండ్రి ఆనతి అన్నప్పుడు పితా + ఆజ్ఞ అనం. పితృ + ఆజ్ఞ = పిత్రాజ్ఞ అని యణాదేశసంధి చేస్తాం. ఇక్కడ పిత యొక్క మూలరూపం ఋకారాంతం అయిన పితృ అని తెలియకపోతే మనం సంధి సరిగ్గా చేయలేం. ఇప్పుడు సమస్య ఏమంటే ఏ పదంయొక్క మూలరూపం ఋకారమో మనకు ఎలా తెలుస్తుంది. దానికి మనం నిఘంటువులనన్నా చూడాలి లేదా కావ్యప్రయోగాలనన్నా గమనిస్తూ ఉండాలి. కొన్ని ఋకారాంతాల పదాలను గమనించండి. కర్తృ (చేయువాడు), క్రేతృ (అమ్మువాడు), క్షన్తృ (క్షమించువాడు), గన్తృ (వెళ్ళువాడు), గ్రహీతృ (గ్రహించువాడు), జేతృ (గెలుచువాడు), జ్ఞాతృ (తెలిసినవాడు), దాతృ (ఇచ్చువాడు), ధాతృ (బ్రహ్మ), ననన్దృ (ఆడబిడ్డ), నేతృ (నేత), పితృ (పిత), భర్తృ (భర్త), మాతృ (తల్లి), యోద్ధృ (యోధుడు), వక్తృ (వక్త), శ్రోతృ (శ్రోత), స్రష్టృ (బ్రహ్మ), స్వసృ (సోదరి), హన్తృ (చంపువాడు). ఈ పదాల చివర ఉన్న ఋకారం స్థానంలో అకారం పెడితే ప్రాతిపదికం పదం అవుతుంది. ఉదహరణకు మాతృ = మాత, పితృ = పిత, ననన్దృ = ననంద

అసాధురూపం	సాధురూపం
వక్తవైశిష్ట్యము	వక్తృవైశిష్ట్యము
భర్తవినాశము	భర్తృవినాశము
కర్తపదం	కర్తృపదం

పదం యొక్క చివరి అక్షరం ఏదో తెలియనందువల్ల జరిగే మరి కొన్ని దోషాలను చెప్పుకొందాం. ముందుగా సకారాంత పదాలను చూద్దాం.

శ్రేయస్ అనేది సకారాంతం. మనం సంధి చేసేటప్పుడు శ్రేయస్ శబ్దానికే చేయాలి కానీ శ్రేయశబ్దానికి చేయకూడదు. శ్రేయస్ + పదం = శ్రేయపదం అని వ్రాయకూడదు, శ్రేయః పదం అని వ్రాయాలి. అయితే ఈ సకారం ఎప్పుడు విసర్గలా కనిపిస్తుంది, ఎప్పుడు ఓకారంలాగా కనిపిస్తుంది, ఎప్పుడు శకారం లేదా షకారం లేదా సకారంలా కనిపిస్తుంది, ఎప్పుడు లోపిస్తుంది అంటే విసర్గ సంధులను గురించి తెలుసుకోవాలి.

మనస్ అనేది సకారాంతం. సకారాంత శబ్దాలపై పొట్టి అ తక్క మరే అచ్చు వచ్చినా ఆ అచ్చుకు ముందున్న సకారం లోపిస్తుంది. వికల్పంగా సకారానికి యకారం ఆదేశంగా వస్తుంది. ఇట్లే మనస్ + ఆనందం = మనోనందం కాదు. మన ఆనందం, మన యానందం అవుతుంది. ఇట్లే మనస్ + ఉల్లాసము = మనోల్లాసము కాదు. మన ఉల్లాసము లేదా మనయుల్లాసము అవుతుంది. న్యస్తాక్షరిలో పద్యపాదం మధ్యలో అచ్చు రావాలంటే ఈ సంధి ఉపయోగపడుతుంది.

తమస్ సకారాంతం. తమస్ + ఆవృతం = తమోవృతం కాదు. తమ ఆవృతం లేదా తమయావృతం అవుతుంది.; నమస్ అనేది సకారాంతం. నమస్ + తిరుమలేశ = నమో తిరుమలేశ కాదు. నమస్తిరుమలేశ అవుతుంది. అట్లే నమస్ + త్రివిక్రమ = నమో త్రివిక్రమ అనకూడదు. నమస్త్రివిక్రమ అనాలి.

కొన్ని సకారాంత శబ్దాలపై వచ్చే సంధులు చూద్దాం.

వయస్ + పరిమితి = వయోపరిమితి కాదు, వయః పరిమితి అవుతుంది.; ఛందస్ + శాస్త్రం = ఛందోశాస్త్రం కాదు. ఛందశ్శాస్త్రం లేదా ఛందః శాస్త్రం అవుతుంది ; అప్సరస్ + కాంత = అప్సరకాంత అనకూడదు. అప్సరః కాంత అనాలి.; తేజస్ + ఘనము = తేజఘనము కాదు, తేజోఘనము అవుతుంది.; దుర్వాసస్ + ముని = "దుర్వాసముని" కాదు. దుర్వాసోముని అవుతుంది.

మతుప్ ప్రత్యయాలైన వి, వంతుడు పరమైనప్పుడు సకారం మారదు. యశస్వి, తేజస్వి, యశస్వంతుడు ఇలాంటి రూపాలు వస్తాయి. తేజస్ + వంతుడు = తేజోవంతుడు కాదు. తేజస్వంతుడు అవుతుంది.

పదం చివర ఉన్న సకారం రేఫగా మారుతుంది. రేఫకు రేఫ పరమైనప్పుడు మొదటి రేఫ లోపించి *(మిగతా 22వ పేజీలో)*



వ్యాకరణ విశేషాలు

తెలుగులో సంధి నాలుగు సందర్భాలలో వస్తుంది.

1. అచ్చుకు అచ్చు కలిసినప్పుడు.
2. అచ్చుకు హల్లు కలిసినపుడు.
3. హల్లుకు హల్లు కలిసినపుడు.
4. హల్లుకు అచ్చు కలిసినపుడు.

(ఈ సందర్భాలు ముందుముందు వివరణలో ప్రస్తావనకు వస్తాయి)

అయితే చిన్నయసూరి తమ బాలవ్యాకరణం లో సంధిని ఇలా నిర్వచించారు: **"పూర్వపరస్వరంబులకుం బరస్వరంబేకా దేశంబగుట సంధియనంబడు"** అని.

రెండు అచ్చులు కలిసినప్పుడు అందులో మొదటి అచ్చు ధ్వని లోపించి, రెండో అచ్చు ధ్వని మాత్రమే మిగిలితే దానిని సంధి అనుకోవచ్చు.

రెండు అచ్చుల్లో మొదటి అచ్చును(మొదటి పదం చివరి అచ్చు) పూర్వస్వరమనీ రెండో అచ్చును(రెండో పదం మొదటి అచ్చు) పరస్వరమనీ అంటాము. ఈ రెండు అచ్చుల స్థానంలో రెండో అచ్చు ఏది ఉందో అదే వస్తుంది. ఇలా కొన్నిటిని తొలగించి వాటి స్థానంలో వేరొకటి వస్తే దానిని ఆదేశం అంటాం. అంటే సంధి నిర్వచనం ప్రకారం రెండు అచ్చులు కలిసినప్పుడు అందులో రెండో అచ్చుగా ఏ అచ్చు ఉందో ఆ అచ్చే ఆ రెంటి అచ్చుల స్థానంలో ఆదేశంగా వస్తుంది. ఇది స్థూలంగా.



చిన్నయసూరి నిర్వచనం ప్రకారం కేవలం రెండు అచ్చులు కలిసినప్పుడు మాత్రమే సంధి అనేది వర్తిస్తుంది.. కానీ పైన చెప్పు కున్న 4 సందర్భాలలో మరి మిగతా మూడు సందర్భాలలో సంధి అనేది వర్తించదు కదా! కేవలం పూర్వమూ పరమూ అచ్చులు ఉన్నప్పుడే కదా సంధి అనేది వర్తిస్తుంది అనే సందేహం కలుగుతుంది.

ఇక్కడ ఒక విషయం స్పష్టం చేసుకోవాలి.

బావ్యా. సంధి పరిచ్ఛేదంలో మొదటి 11 సూత్రాలలో మాత్రమే సంధి అనే పదం వాడబడింది. ఆపై ఎక్కడా సూత్రాలలో సంధి అనేది వాడలేదు. కానీ ఆ 11 సూత్రాల వరకు మాత్రమే సంధి పరిమితం కాలేదు. అంటే కేవలం అచ్చూ అచ్చూ కలిసినప్పుడే కాక మొదట్లో మనం ప్రస్తావించుకున్న మిగతా 3 సందర్భాలలో కూడా జరిగేది సంధిగానే పరిగణింపు.

నిర్వచనం వరకు సూరివర్యులు రెండు అచ్చులు పరమైతేనే సంధి అని చెప్పినా ....పైన తెల్పిన మిగతా 3 సందర్భాలలో కూడా అది సంధిగానే పరిగణించడం సూరికి సమ్మతం.

1. సంధిపరిచ్ఛేదంలో రెండు అచ్చుల మధ్య సంధి తోపాటు రెండుహల్లులు కలిసినప్పుడు, అచ్చుకు హల్లు, హల్లుకు అచ్చు కలిసినప్పుడు జరిగే మార్పులను కూడా చూపాడు. కనుక మొదట్లో మనం చెప్పుకున్న నాలుగు సందర్భాలూ కూడా సంధి అనే పరిగణన చిన్నయసూరి గారి దృష్టిలో. అందుకే వాటిని కూడా సంధి పరిచ్ఛేదంలోనే చెప్పాడు.

2. అంతేకాక చిన్నయసూరి సంజ్ఞా. 17 లో యకారంబును వువూవొవోలును దెలుగు మాటలకు మొదటలేవు** అనే సూత్రంలో హరియతడు, నిద్రవోయె ఇట్టిచోట్ల సంధి వశంబున వచ్చిన యకార వకారంబులు (యడాగమం, గసడదవాదేశం) అన్నాడు.. అంటే సంధిగతంగా కేవలం పరస్వరం ఆదేశంగా లేని యడాగమం, గసడదవాదేశాలను కూడా సూరిగారు సంధిగా పరిగణించినట్టే కదా!

ఇలాటి ఆధారాలవల్ల సూరిగారు తమ సంధి నిర్వచనం కొంత భిన్నంగా ఉన్నప్పటికీ సంధి పరిచ్ఛేదంలో చెప్పిన, చూపిన అన్ని సందర్భాలలోనూ జరిగేది సంధియే అని సూరిగారు చెప్పినట్లే.

**వోలె వంటి ఒకటి రెండు పదాలు కనిపిస్తున్నాయి.

(సశేషం)

తటిల్లతలు

ప్రశ్న: 'బ్రహ్మచారీ శతమర్కటః' అంటారు కదండీ ఈ ఆగిరిపల్లి వేద సంస్కృత పాఠశాలలో ఇంతమంది బ్రహ్మచారులు మీ చతుర్భాషా అష్టావధానానికి(24/9/25) వచ్చారు కదా వీరు ఒక్కొక్కరు 100 కోతులతో సమానమా?

సమాధానం: ఆ మాటలోని అంతరార్థం తెలియక మీరు మీ వంటి వారు అపార్థం చేసుకుంటున్నారు. బ్రహ్మచారి అంటే విద్యార్థి. అతడు వేదాలు బ్రాహ్మణాలు ఉపనిషత్తులు ఉపవేదాలు శాస్త్రాలు మరెన్నో శాఖలు చదవాలి. కోతి ఒక శాఖ నుండి మరొక శాఖకు వందలాది చెట్ల పైకి వంద కోతులు దూకినట్లు అన్నీ చదవాలి. అందుచేత శ్రద్ధ కలిగిన బ్రహ్మచారి అధ్యయనపరుడై వేద విద్యలో అనేక శాఖల మీదికి దూకుతాడు కనుక బ్రహ్మచారి నూరు కోతుల వలె అనేక శాఖలపై సంచరించాలి అనే ఈ మాట పొడుపు కథ లాంటిది. ఇప్పటికైనా అసలు అర్థం తెలుసుకోండి. ఈ బ్రహ్మచారులను దీవించండి లేకపోతే మీరు అనుకున్నట్టే మనల్ని సత్కరిస్తారు.

అచ్చతెలుగుఆంధ్రప్రాకృతసంస్కృతావధాని

పాలపర్తి శ్యామలానంద ప్రసాదు

2

విశిష్ట తెలుగు భాషా వైభవం- ఛందః ప్రాముఖ్యం

- డా. సంగనభట్ల నరసయ్య

నిజజీవితంలో వృత్తాలకంటె దేశిచ్ఛందస్సుల పాత్ర పెద్దది. కొన్ని శతకాల్లో వృత్తాలు కంఠస్థం, ప్రాథమిక విద్యలో చేసినా, చేయనక్కరలేనివి దేశీపద్యాలు. వేమన ఆటవెలది నందుకొన్నాడు. జీవిత సత్యాలెన్నిటినో అందించాడు. తొలి రెండు పాదాల్లో సమాజం, మూడోపాదం పైరెంటివల్ల లభించిన జీవనసత్యం, నాల్గోపాదం మకుటం సరేసరి. అన్ని పాదాల పాదాంత విచ్ఛేదంలో తెగి సులభంగా ఒకసారి వినినంతనే కంఠస్థం అయ్యేది.

అనువుకాని చోట అధికుల మనరాదు
కొంచెముండుటెల్ల కొదువకాదు
కొండ అద్దమందు కొంచెమై ఉండదా?

ఈ ఆటవెలదిలో ఒక్కో పాదమే సంభాషణల్లో ప్రయోగించే వారు. ఇది ఆటవెలదిలో గణవ్యవస్థలోని వెసులుబాటు. ఇది వేమనశైలి. ఈ నడకలు బుర్రలోకెక్కి ఛందస్సు తెలియకున్నా పద్యాలు రాసేవారు.

ఎలుక తోలు తెచ్చి ఏడాది ఉతికినా
నలుపు నలుపె కాని తెలుపు కాదు – అని అల్లుకునేవారు.

ఈ అల్లకం వేమనే రాసాడనుకొన్న త్రిసహస్రాధిక పద్యాల సంఖ్యకు దారితీసింది. ఇవన్నీ వేమన రాసాడా? ఆయన ఛాయాపురుషులు రాసారు. వారు పండితులా. కాదు కదా! చదువురాకున్నా నడకల్లో అల్లగల భావుకులు.

మారిషస్ దేశంలో ఇపుడున్న ఐదో తరానికి మూలపురుషులు తెలుగువారు. బ్రిటిషు వారి బందీలుగా శ్రీకాకుళ విశాఖపట్నాల పల్లె ప్రాంతాల ఓడల కళాసీలు, కార్మికులు. వారు తమకు కంఠస్థంగా ఉన్న నరసింహ శతకాన్ని, దేహంతోపాటు మనసులో పెట్టుకొని వెళ్లి, చీకటి కొట్టాల్లో కొరడా దెబ్బలు తింటూ స్వామిని వేడుకుంటూ, స్మరించుకుంటూ నిలుపుకొని, కాగితం, కలం లేకున్నా తరువాతి తరాల కందించారు. వారికిప్పుడది వేదంలా పండుగల్లో ప్రయుక్తం కావడం నేను ఆ దేశంలో చూసాను. ఇది సీసచ్ఛందంలో శేషప్ప రాసినందువల్ల మనందరి మనః పేటికల్లో సజీవం. రెండు వందల సంవత్సరాలు తెలుగు రాజ్యాల్లో వీధిబడి పాఠ్యం. నాటి విద్యార్థులు కంఠస్థం చేసే చిన్నపద్యం కృష్ణశతకం కందపద్యం – కాకుత్థ్సం నరసింహదాసు (మనుమడు), పెద్దపద్యం నరసింహశతకం శేషప్ప (తాత) రాసినవి. ఎందరికో పదుల్లో కంఠస్థాలు. వీధిబళ్లు పోయినా, నేటి ఆధునిక విద్యావిధానంలో చదివిన వారికి కూడా జీవితంలో పదిసార్లైనా పాడేవే.

కం. హరి యను రెండక్షరములు
హరియించును పాతకంబులంచు జనాభా! అనో

సీ. తల్లిగర్భము నుండి ధనము తేడెవ్వడు
వెళ్లిపోయేనాడు వెంటరాదు
లక్షాధికారైన లవణమన్నమె కాని
మెరుగు బంగారమ్ము మింగబోడు అనో

ఈ ఇద్దరు రాసిన పద్యాలు ఛందో బద్ధత కారణంగా కంఠస్థం లేవా? వీరిద్దరు తాతమనువలు తరతరాల భక్తి నిధినందించారు. ధర్మపురి గోదావరి తీరస్థ నారసింహ క్షేత్రవాసులు. (వీరి నాలుగు శతకాలు చతుశ్శతిగా ముద్రించాను.) అది ఛందానికి, భాషా వైభవానికీ గల లంకె.

రగడల వంటి గేయచ్ఛందస్సుల వల్ల జానపద గీతాలు కంఠస్థాలు. జానపద కవులెందరో రచనలు చేసారు. వరకవులనే సంప్రదాయంలోని కవులు భక్తిసాహిత్యాన్ని కల్పించారు. భజన పాటల సంగతి చెప్పేదే లేదు. రామదాసైనా, త్యాగరాజైనా ఈ సంప్రదాయంలోని వాగ్గేయకార లక్షణాలను, ద్వితీయాక్షర, అంత్యప్రాసలను, తాళగణాలను నడకలను స్వీకరించినవారే. గేయఛందస్సులు వీరి జీవితంలో భాగం.

సామాన్యులైన జానపదులైన బర్లు, గొర్లు కాసేవారు సైతం పాడుకునే పద్యాలు నాటకాల్లోవి. తిరుపతి వేంకటకవుల నాటక పద్యాల్లోని ఛందస్సులు, వృత్తాలా? దేశీ పద్యాలా తెలియనివారైనా హాయిగా పాడుకునేవారు. తప్పులున్నా నడకలు ముఖ్యం. పాండిత్యం లేకున్నా పాడటం ప్రధానం. **"మానవాధీశ్వరా! మణుగు నాలుక వాడు"** అని పాడితే మనువు నాల్గవవాడు (పోతన్న పద్యం) అని మనం సర్దుకొంటాం.

కందార్థాలు రాసేవారు కందం సగం రాసి గేయంలోకి మారేవారు యక్షగానాల్లో ఈ ప్రక్రియను రాసేవారు పెద్దపండితులు కాకున్నా నాటక రచయితలే. ఇవి ఛందోగేయ మిశ్రమ ప్రక్రియలు. జానపదుల జీవనంలో భాగాలు.

(సశేషం)



కావ్యదోషాలు - 2

డా॥ సూరం శ్రీనివాసులు

వామనుడు కావ్యాలంకార సూత్రవృత్తిలో పద, పదార్థ, వాక్య, వాక్యార్థ దోషాలను విడివిడిగా నిర్వచించి ఉదాహరణలతో నిరూపించాడు. ఆ విభాగాన్నే తీసికొని మనం కొనసాగుదాం.

పదదోషాలు

“దుష్టం పదమ్ అసాధు= కష్టం = గ్రామ్యమ్ = అప్రతీతమ్ = అనర్థకమ్ చ” అని సూత్రం. 1. అసాధువు 2. కష్టం 3.గ్రామ్యం 4.అప్రతీతం 5.అనర్థకం

1. అసాధువు:

‘శబ్ద స్మృతి విరుద్ధమ్ అసాధు’ అని అసాధు దోషలక్షణం. శబ్దస్మృతి అనగా వ్యాకరణం. వ్యాకరణానికి విరుద్ధమైన పదప్రయోగం చేస్తే అది అసాధు దోషం. అంటే పద్య, కావ్య, రచనలో వ్యాకరణం అంగీకరించని, లేదా వ్యాకరణ సూత్రాలలో కుదరని శబ్దప్రయోగం చేయకూడదు.



అయితే కొందరు ‘ప్రయోగశరణం వ్యాకరణం’ అన్నారు కాబట్టి మా ప్రయోగాలను బట్టి వ్యాకరణ సూత్రాలు అనుకోవాలి గాని మమ్ములను తప్పంటే ఎలా అని దబాయిస్తారు. నిజమే. వ్యాకరణం ప్రయోగ శరణమే అయితే ఎవరి ప్రయోగం? అన్నది చర్చనీయాంశం. శబ్దరత్నాకర నిఘంటు నిర్మాత నన్నయ, తిక్కన, ఎఱ్ఱన, నాచన సోములను’ మాత్రమే ప్రథమ తరగతి కవులుగా స్వీకరించారు. ఆ క్రమంలో కవులను ఆరవ తరగతి దాకా విభజించాడు. ఇప్పుడీ ఆరు తరగతుల వారికీ సమానంగా ప్రామాణికత్వాన్ని ఆపాదించగలమా? బాలవ్యాకరణకర్త కవిత్రయ ప్రయోగాలనే ప్రామణికంగా స్వీకరించాడు. కొందరు ఇప్పటికీ ఆ హద్దులకు లోబడియే కవితావ్యాసంగం చేస్తున్నారు. కవిత్రయభిన్నమైన ప్రాచీన కవులకే ప్రామాణికత్వం సంశయగ్రస్త మైనపుడు మన వంటి పిల్ల కాకులు(కవులు) కూడా మా ప్రయోగాలూ ప్రమాణమే అనవచ్చా? అసలు

శాస్త్ర ప్రయోగవచసోః శాస్త్రం బలవదుచ్యతే ।
అనిష్పన్నే పదేతేన ప్రయోగాశ్రయణం హితమ్ ॥

అని అథర్వణాచార్యుల వచనం. శాస్త్రప్రయోగాలలో శాస్త్రమే బాలవత్తరం. శాస్త్రం ద్వారా పదసిద్ధి కుదరక పోతే అప్పుడు ప్రయోగాలను ఆశ్రయించాలి అని ఆయన భావం. అంటే అప్పటికీ వ్యాకరణ శాస్త్రం ద్వారా రూపనిర్ణయం చేయబడిన పదాలు, తత్సంబద్ధ పదప్రయోగాల విషయంలో శాస్త్రమే ప్రమాణం. దానికి విరుద్ధమైన ప్రయోగం చేస్తే అది దోషమే. పద సంబంధి కాబట్టి పదదోషం. నూతనపద కల్పనమో, లేక లోకసిద్ధమైన నూతన పదస్వీకారమో అయితే అది ప్రయోగ శరణం. అది కూడా ప్రామాణికులుగా విలువగలవారు చేస్తే ప్రామాణికమై శుద్ధపదమవుతుంది అనుసర్తలకు కూడా. పర్వతంలోనూ, పరమాణువులోనూ పదార్థత్వం ఉన్నది కాబట్టి రెండూ సమానమేనని నిర్ణయించి అందరి ప్రయోగాలను ప్రమాణంగా స్వీకరించలేదు శాస్త్రం. వైయక్తిక రాగద్వేషాలకు అక్కడ స్థానం లేదు. ఇదంతా తెలుగు వ్యాకరణ చర్చ.

సంస్కృత వ్యాకరణ శాస్త్రం పటిష్ఠమైనది. చాలా కాలం క్రితమే అది-వ్యాకరణం - సంస్కృతం. మనలాంటి వాళ్ళ ప్రయోగాలకు అక్కడ ప్రామాణికత్వ చర్చయే లేదు. యథా తథంగా పాటించడమే సంస్కృతాన్ని సులభతరం చేయాలనుకొని ఉద్యమించి పని చేస్తున్న వారు కూడా ఆ శాస్త్రంలోని వెసులు బాటుల మేర సరళీకరిస్తున్నారే కానీ విపర్యస్తం చేసే ప్రయత్నం చేయటం లేదు. కాబట్టి ఏ ప్రత్యేక ప్రయోజనాన్ని ఉద్దేశించి చేసిన ప్రయోగమైతే తప్ప మిగిలినవి వ్యాకరణ విరుద్ధాలైతే అవి అసాధువులే.

సంస్కృతంలో శిక్షాగ్రంథాలు ధ్వని వర్ణాలను నిర్దేశిస్తాయి. వ్యాకరణం పదస్వరూపాన్ని తెలుపుతుంది, పద పదాంతర సంబంధాన్ని తెలిపే కారక విషయాలనూ వ్యాకరణమే నిర్దేశిస్తుంది. వాక్యవిషయాలను మీమాంసాశాస్త్రం ప్రతిపాదిస్తుంది. ప్రాతిశాఖ్య గ్రంథాలు కూడా ధ్వని స్వర పదవిషయాలను పరామర్శిస్తాయి.

వ్యాకరణ విరుద్ధ ప్రయోగాలాంటే ఇది పదానికి సంబంధించి నది కాబట్టి సుబన్త, తిఙన్తాలలోని వ్యాకరణ విరుద్ధప్రయోగాలు ఇక్కడ ప్రస్తావనకు వస్తాయి. పద, కృదన్త, తద్ధితాన్త, సమాసాల లోని దోషాలు ఇక్కడ విషయాలు. సంధి కారకాలకు సంబంధించిన దోషాలను వాక్యదోషాలలో చూద్దాం.

కర్ణుఁడు దుర్ణయుండగుచు గౌరవనాథునిఁ బాడు చేసె నీ
నిర్ణయ మాదరించి యవినీతులు పాండవు లైరి; నీవునుం
గర్ణుఁడు లేక యున్న యెడఁ గౌరవపాండవ యుద్ధమున్నదే
కర్ణుఁడొకండె దుర్జనుడు గాఁడు సుమీ! వసుదేవనందనా!

పాండవాశ్వమేధము - ప్రథమాంకము

ఇక్కడ దుర్ణయుడు పదప్రయోగం విచారణీయం. ‘దురః షత్వణత్వయోరుపసర్గత్వప్రతిషేధో వక్తవ్య” అనే వార్తికాన్ని అనుసరించి ఇక్కడ నకారానికి ణత్వం రాదు. దుర్నయుడు అని మాత్రమే వాడాలి. అయితే నన్నయ, తిక్కనలు కూడా దుర్ణయ పదాన్ని వాడియున్నారు.



నన్నయ

**పాలితదుర్ణయుండు శిశుపాలుఁడు బాలుఁడు వీనినేల భూ
పాలక నీకుఁ బట్టువఱుపన్ మతి ధర్మ వెఱుంగ వీనికిం
బోలునె రాగకోప పరిభూత మనస్కున కల్పరాజ్యుల
క్ష్మీలలనాంధబుద్ధి కనిమిత్తమహత్పరివాదశీలికిన్**

సభా పర్వము 2/22

తిక్కన

**కర్ణుని సారథి నైనను
నిర్ణయమున కేను బార్థునిం గాచెద నా
దుర్ణయ విచారు నిమ్మెయిఁ
గర్ణకఠోరంబులాడి కలఁతుంబోరన్** –ఉద్యోగ పర్వము 1/ 112

నన్నయ ప్రయోగం పాద మధ్యంలో వున్నా తిక్కన ప్రయోగా ప్రాసస్థానంలో ఉండటం గమనీయం.

సంస్కృత నిఘంటువులలోన దుర్నయ అన్న ఆరోపమే వుంటుంది ణత్వరహితంగా. కాబట్టి నన్నయ, తిక్కనల ప్రయాగాన్ని "ఆర్యవ్యవహారంబు దృష్టంబు గ్రాహ్యంబు" అని దాన్ని స్వీకరించవలసిందే కానీ మనం ప్రయోగించకూడదు. తిరుపతివేంటకవులను మనం ప్రమాణంగా భావించినా వారు వాడవచ్చు గానీ మనం వాడకూడదు.

ఒక ప్రయోగం **తద్ధితాంతం** –

**రసవిహారమైన రామాయణము నందు
చవులు గొన్న మనసు దవులు కొన్న
జన్మమునకు వేఱె చరితార్థ్య మేముండు
సద్గుణాలవాల! సాధుశీల!**

పద్యాలతోరణం –సాంప్రతి సురేంద్రనాథ్

ఇక్కడ చరితార్థ్య పదం వ్యాకరణ విరుద్ధం. చరితార్థస్య భావః చారితార్థ్యం– "గుణవచన బ్రహ్మణాదిభ్యః కర్మణి చ" అనే సూత్రంతో చరితార్థ శబ్దం మీద ష్యఞ్ ప్రత్యయం, "తద్ధితేష్వచామాదేః" అనే సూత్రంలో ఆదివృద్ధి రావాలి. చారితార్థ్యం కావాలి. ఒక వేళ దానిని ముద్రణదోషంగా భావించి చారితార్థ్యమని సవరించు కొంటే గణభంగమై, ఛందోభంగదోషమౌతుంది.

మరొక ప్రయోగం – **కృదంతం**

**నల్లని మేనికాంతియె ఘనమ్ముగ మారి శయాన మయ్యెనా
చల్లని చూపు వెన్నెలలు చందురుడై మరురూపు దాల్చెనా
పిల్లనగ్రోవి గాలులవి వీవెనలయ్యెన చిన్నికృష్ణ నీ –
యల్లరి లేక గోకాలము నాకుల మయ్యెను రేయి గాంచుమా!**

మైలవరపు మురళీకృష్ణ

ఇది ఒక రమణీయమైన పద్యం. ఆస్వాదించి అనందించాలి. అయితే "ఏకః శబ్దః సుష్ఠు ప్రయుక్తః సమ్యక్ జ్ఞాతః స్వర్గే లోకే కామధుక్ భవతి – అని కదా శబ్దబ్రహ్మ నుపాసించిన మహర్షుల అనుశాసనము" అన్న విదగ్ధహృదయుల భావాన్ని గౌరవిస్తూ ఈ 'శయాన' పదచర్చ. ఇది పొరపాటైనా చాలా ప్రౌఢమైన పొరపాటు.

శయనం అంటే పక్క. శీఙ్ ధాతువుపై 'ల్యుట్ చ' అనే సూత్రంతో ల్యుట్ ప్రత్యయం చేరితే 'యువోరనాకే' అని అనాదేశం వచ్చి శయనం అవుతుంది. ఇక్కడ వాడవలసిన పదమిది, కానీ పొరపాటుగా శయాన వాడబడింది. వర్తమనకాలిక – అసమాప్త్యర్థంలో శానచ్ ప్రత్యయం (లక్షణ హేత్వోః క్రియాయాః సూత్రంతో) శయాన పదం నిష్పన్నమవుతుంది. అది అర్థం వేరే. శయాన పదం కూడా ప్రసిద్ధమే అయినందువల్ల భావార్థంతో కూడా దానిని వాడటం జరిగింది. అక్కడది అసాధువు అంటే ఆ పదం నిష్పన్నమే. అక్కడ ప్రయోగించటం అసాధువు. ల్యుడంతం వాడవలసిన చోట శాన జంతం వాడటం.

తెలుగులో కొన్ని –

**అక్షి ద్వంద్వవిచారణన్ జగములాహాహా యనున్ రీతిలో
సాక్షా ద్రక్షణ వక్షవై పొలుచు విశ్వారాధితా!**

రాయప్రోలు సీతారామ శర్మ

అనెడి రీతిలో అనే అర్థంలో అనున్ రీతిలో అని తద్ధర్మాన్ని ప్రయోగించటం వ్యాకరణ సమ్మతం కాదు.

**వేయి పద్గలు వ్రాసి వేనోళ్ళ కీర్తింప
కల్పవృక్ష మిడిన యలఘుఁడెవరు?...**

రాయప్రోలు జగదీశ్చంద్ర శర్మ

ఇక్కడ పడగలను పద్గలు అని ముడుచికొనేటట్లు ప్రయోగించుట వ్యాకరణ విరుద్ధం.

'పురుషుల్లోన పూంగవా' అని ఒక గొప్ప సినీకవి ప్రయొగం. "సింహశార్దూలనాగాద్యాః పరే శ్రేష్ఠత్వ గోచరాః" అని సింహ శార్దూలాది పదాలు సమసంలో ఉత్తర పదాలుగా వున్నప్పుడు శ్రేష్ఠతార్థాన్నిస్తాయి. పుంగవ పదం ఆ గణంలోనిది. పురుష పుంగవా అని సమాసంగా వాడాలి కానీ పురుషుల్లోన పుంగవా అని వ్యస్తం చేయకూడదు. అలా చేస్తే మగవారిలో ఎద్దువు అనే అర్థం వస్తుంది.

వర్తమాన కాలంలో ఈ చ్యుత సంస్కార(అసాధు) దోషాలు కోకొల్లలు. తెలుసుకొని పదాలను ప్రయోగించాలన్న శ్రద్ధ, జిజ్ఞాస కొరవడ్డాయి. జీవితాలలో ప్రవేశించిన త్వర అధ్యయనాసక్తినీ, అవకాశాలనూ కుడా దూరం చేస్తోంది. ఈ అసాధువు ప్రయోగ దోషాలే ఎక్కువ కాబట్టి ఈ రోజుల్లో ఇంతగా – ఇంత సంక్షేపంగా – చెప్పవలసి వచ్చింది. ప్రామాదిక దోషాలనే చూపించటం జరిగింది కానీ నిలువెల్లా దోషాలైన పద్యాల జోలికి నేను వెళ్లలేదు.



మరికొన్ని –

"జ్ఞానపీఠమునెక్కి **సా(మ్రాట్టు**గా నిల్చి
కవిలోకకాంతుల ఖగువెవండు" **(స(మ్రాట్టు)**

"(శీధర **చరితా**పయోధి బహుధాస్మరణీయము భక్తకోటికిన్" **(చరిత)**

"రాకాశీతాంశురుచిర(**ప్రసన్న**విలసత్క(మస్మితోల్లాస" **(ప్రసన్నత)**

"భావితరములను బానిసలుగ మార్చు
ధనికపోకడలదౌ యునికి చేర్చి **(వైరిసమాసం)**

"శైలేం(ద్రకులేశముత్యము" (వైరిసమాసం)

"ఉల్లములోన నిను దలతు **నుత్సుకతో**డన్" **(ఉత్సుకత)**

"సరిదుద్యద్ఘనదేహదీధితులు విశ్వ(**శేయ** కారుణ్యముల్"
((శేయశ్శబ్దం సకారాంతం. అకారాంతంగా వాడకూడదు)

"హారస్ఫారపటీరహీర**ధవళా**హారాయితాకారయౌ" **(ధవళ)**

"మునిజన **సహృదయ కమల** వికసనధామ!"
(హృదయకమలం లేదా సుహృదయకమలం గణపూర్తికై. సహృదయ అంటే మరొక కర్తను ఆక్షేపిస్తుంది. లేదా సహృదయత అని భావార్థంలో వాడవచ్చు. అప్పుడు హృదయకమలమన్న రూపకం చెడుతుంది.)

ఇవన్నీ ఈ మధ్యకాలంలో కవుల (ప్రయోగాలే.

(సశేషం)

(10వ పేజీ తరువాయి)

నిఘంటు పరిజ్ఞానం

ఏకాక్షరములు (స్త్రీ లింగములు. ఉదా: శ్రీః, ధీః, భూః – ఇలా చెప్పే (క్రమంలో నామ విద్యున్నిశా వల్లీ వీణాదిగ్భూనదీ హ్రియామ్ – మెఱుపు, రాత్రి, తీగ, వీణ, దిక్కు, భూమి, నది, సిగ్గు, పర్యాయపదములు (స్త్రీ లింగములు అని పేర్కొన్నాడు. కానీ హ్రీ పర్యాయపదాలలో మందాక్ష శబ్దము నపుంసక లింగం, (వ్రీడా శబ్దం పుంలింగం. ఇట్టి సందర్భములలో సందేహాన్ని పరిష్కరించుటకు 'శేషంతు జ్ఞేయం శిష్టప్రయోగతః' అని అన్నారు. అనగా ఇచ్చట స్పష్టము కాని వాటిని శిష్టప్రయోగముల ద్వారా తెలుసుకొనవలెనని భావము. పుంలింగాలను పేర్కొంటూ క,ష,ణ,భ,మ,ర,ప,థ,న,య,స,ట వర్ణములు ఉపాంతములు గలిగిన అదంత శబ్దములు, పుంలింగాలనడం వలన పఠనా సౌలభ్యం కలుగుచున్నది.

ఈ అమరకోశము విద్యార్థులకు, విద్వాంసులకే కాదు అవధానులకు, జిహ్వాగ్రంలో నటియించదగిన కోశము. అవధానము చేయగోరువారు ఈ నిఘంటవును లోబరచు కొనుటచే పండిత మండితమైన సభను లోబరచుకొను సామర్థ్యమును పొందెదరు. దీనికి గల 60 వ్యాఖ్యానాలలో తలమానికమైన గురుబాల (ప్రబోధిక వ్యాఖ్యతో కూడిన (గ్రంథం (ప్రతి అవధాని చెంత ఉండవలెను.

పదస్వరూప నిరూపణము, సామాన్యవిశేషార్థ (ప్రకాశనము, నానార్థ (ప్రతిపాదనము, పద్యాయ పద (ప్రదర్శము మొదలగు లక్షణాల గల పదసంకలనమునకే కోశము, నిఘంటువు, అభిధానము, అనుశాసనము, అని పేర్లు. ఈ లక్షణములకు లక్ష్యమై ఒప్పారు నది అమరకోశము. అవధాన విద్యార్థులకిది దారి బత్తెము.

(సశేషం)

(15వ పేజీ తరువాయి)

పద్యకవిత్వం-సాధుప్రయోగాలు

దాని ముందు ఉన్న అఆ ఇఈ ఉఊ లకు దీర్ఘం వస్తుంది.

ధనుస్ + రాశి = ధనుర్ + రాశి = ధనూరాశి అవుతుంది. ధనుర్ రాశి కాదు.

అంతర్ + రాష్ట్రము = అంతారాష్ట్రము అవుతుంది. అంతర్ రాష్ట్రము కాదు.

నిస్, దుస్ శబ్దాలపై క,ఖ,ప,ఫ లు పరమైతే సకారం షకారం అవుతుంది. కనుక నిస్ + పీతము = నిస్పీతము కాదు. నిష్పీతము అవుతుంది. ఇలాగే నిష్కామ, నిష్కారణ, నిష్ఫల మొదలైన శబ్దాలు తయారవుతాయి.

మరి కొన్ని సంధి దోషాలను తదుపరి వ్యాసంలో చూద్దాం.

(సశేషం)

స్మృత్యంజలి



గౌరీభట్ల (శీనాథశర్మ గారికి స్మృత్యంజలి. ఒకానొక పారంపరిక ఋషి సం(ప్రదాయాన్ని మనకళ్ళ ముందు ఆవిష్కరించి, నిరంతరం (శీ మాతృ సేవలో తరించి, తమ తం(డిగారు అవధూత అయిన సాం(ద్రనంద ఘనస్వరూప నృసింహస్వామివారికి (ప్రియతమ అంతేవాసులై పూర్వజన్మ సంస్కార ఫలమైన ఆర్షవాఙ్మయాన్ని మంగళగీతాలుగా అపూర్వస్తో(త్ర శ్లోకాలుగా రచించి, అష్టావధాన, ఆశు కవితావిన్యాసాలను అలవోకగా అందించి, 'పద్మప(త్ర మివాంభసా' రీతిగా సంసార జీవనాన్ని సాగిస్తూనే పర(బ్రహ్మ తత్త్వచింతనతో గడిపిన విద్వద్వరేణ్యులు (బ్రహ్మ (శీ గౌరీభట్ల (శీ నాథశర్మ గారు.

(ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, అష్టావధాని గౌరీభట్ల (శీనాథ శర్మ (70) అక్టోబర్ 9వతేదీ గురువారం మధ్యాహ్నం దివంగతులయ్యారు. వారికి అవధాన పుష్కరిణి పక్షాన స్మృత్యంజలులందిస్తున్నాం.



అవధాన సౌరభమ్-2

-సాంప్రతి సురేంద్రనాథ్

ప్రాచీనులలో ప్రతిఒక్కమహాకవీ ప్రతిభాపాండిత్యమేరు పర్వతోపమానులే కాని సామాన్యులు కారుగదా. ఇంచుమించుగా అందరూ అవధానశబ్ద విభూషితులే.

"పాయక పాకశాసనికి భారత ఘోరరణంబు నందు నారాయణునట్లు" (ఆదిపర్వము:1-25)

నన్నయమహర్షికి తోడుపడిన సహాధ్యాయి, అష్టభాషాచక్రవర్తి. నారాయణభట్టును నన్నయమహర్షి నందంపూడి శాసనమున. "అష్టాదశావధారణచక్రవర్తి"అని ప్రశంసించినారు..

"నాట్యచూడామణి" సంస్కృత గ్రంథకర్త సోమనాథుడు, "అష్టావధానవిఖ్యాతుడు" ఆకవి నాచనసోమనాథుడే అని' సంస్కృత సాహిత్య చరిత్ర'లో యమ్.కృష్ణమాచార్యులు అభిప్రాయము. వారి సముచితాభిప్రాయమునకు ఈ శాసనము ఆధారము..

"అష్టభాషాకవిత్వశ్రీ వాణీవిజిత సంపదే సోమాయ నాచనాంభోధేః సోమాయామిత తేజసే"

(Inscriptional Glossary of AndhraPradesh)

'సాహిత్యదర్పణము" సంస్కృతములో అనుపమానమైన అలంకార శాస్త్రగ్రంథము. ఆ గ్రంథకర్త విశ్వనాథకవిరాజు "అష్టాదశభాషా వారవిలాసినీ భుజంగః"అని తనకీర్తిని ప్రకటించుకొన్నాడు.

సంగీత సాహిత్య సార్వభౌముడు రామరాజభూషణుడు సకలభాషావిశేష నిరుపమానావధాన శారదామూర్తి - సంస్కృత ప్రాకృతాంధ్రపద్యములతో అష్టావధానమే కాక శతావధానము కూడచేసి చూపెనని శ్రీ వెంపరాలసూర్యనారాయణశాస్త్రిగారు..

క్వణిత సరస్వతీ జఘన కాంచికలాపము వోని కావ్య భూ
షణములు, శ్లేషవాక్పరి లసన్మణి చిత్రమరీచి లోక పో
షణములు గూర్చి యర్చగొనుచారు యశస్వికి రామరాజ భూ
షణకవికిన్ వధానిజన సంఘశిరోమణికిన్ నమస్కృతుల్

అని నెల్లూరు శతావధానమున (1971) ఆ అవధానిజనసంఘ శిరోమణికి "అవధానపితామహులు" కనకాభిషేక, గజారోహణ, గండపెండేర, హస్తకంకణ సత్కారశాలి శ్రీ సి.వి.సుబ్బన్న శతావధానిగారి అక్షరోపహారము..

"చిత్రభారతము" రచించిన చరిగొండ ధర్మన "శతలేఖిన్యవధాన పద్యరచనాసంధాసురత్రాణుడు" ఇలా దాదాపుగా అందరు ప్రబంధకావ్యకర్తలుఅష్టావధాన, శతఘంటాకవనమల్లినవారే. మనము పేర్లు కూడ వినని కవులలో అవధానవిద్యలో పేరెన్నిక గన్న కవివతంసులు.. రేటూరి రంగరాజు.."అష్టావధానకలిత శతలేఖినీపద్యగద్యశక్తి పాటిమీఱినవాడు". గుడారు వెంకటదాసు. అష్టభాషావధానప్రౌఢుడు.."

ఇక స్త్రీ కవయిత్రులు అసాధారణ ప్రజ్ఞామూర్తులు. శ్రీకృష్ణ దేవరాయల విజయనగర సామ్రాజ్యానంతరము ఆ సాహితీ సమరాంగణసార్వభౌముని ఏలుబడిలో ఉండి నాయకరాజుల పాలనలో వర్ధిల్లిన తంజాపూరు సంస్థానము తెలుగుసరస్వతికి అనేకానేక సాహిత్య ప్రక్రియలతో అత్యుత్తమ సారస్వత నీరాజనముతో అర్చించినది. శ్రీకృష్ణరాయల "భువనవిజయము" సంగీతసాహిత్యనృత్య కళాస్థానమై విరాజిల్లినట్లే తంజాపురమున నాయకరాజులు..ప్రత్యేకముగ అచ్యుతరాయల కుమారుడు రఘునాథరాయలు అతని కుమారుడు విజయరాఘవ రాయలు పోషించిన సంగీతసాహిత్యనృత్యకళాస్థానమై "శారదాధ్వజము" సభఅంతే కాంతిమంతమై శోభాయమానమైనది.

ఆ "శారదాధ్వజ" సభలలో కవులు అష్టభాషలలో సమస్యలు పూరించెడివారు. అప్పటి అష్టభాషలు -

'శౌరసేని, మాగధి, పైశాచి, చూళికాపైశాచి, అపభ్రంశము, ప్రాకృతము, భాండారభాష, సంస్కృతము'

రఘునాథరాయలు సంస్కృతాంధ్రములలో కావ్యములు రచించిన వాడేకాక కృష్ణరాయలవలె కావ్యముల నంకితము తీసికొన్నవాడుకూడ. చేమకూర వేంకటకవి "విజయవిలాసము" అంకితమునిచ్చినది. రఘునాథరాయలకే. అంతేకాక సంగీతమున నూతనరాగతాళములను, కనిపెట్టిన గానశాస్త్ర విశారదుడు. వీణల మేళవింపులను సంస్కరించి "రఘునాథమేళ" అను మేళకర్తరాగమునకు కర్త..రఘునాథరాయలవారు.

"శివభారతము"రచించిన మహాకవి, శతావధాని శ్రీ గడియారము వేంకటశేషశాస్త్రిగారు రఘునాథరాయల చరిత్రమును "రఘునాథీయము" కావ్యముగ వ్రాసినారు.

ఆ సంగీతసాహిత్యసమరాంగణ సార్వభౌముని ఆస్థానములో "మధురవాణి" గొప్పవిదుషీమణి. రఘునాథరాయలు తెలుగులో రచించిన రామాయణమును "రామాయణసారకావ్యతిలకము" అనుపేర సంస్కృతమున కనువదించిన మహా కవయిత్రి. ఆ కావ్యం.. ఆశ్వాసాంతగద్యలలో "మధురైక ధురంధరాంధ్ర కవితా నిర్మాణ సమ్మాన్యయా" అని తనప్రశస్తిని సగర్వముగ ప్రకటించుకొన్నది. ఈమె అసలు పేరు "శుకవాణి". కాని.. సంగీతసాహిత్యనృత్యకళామాధుర్యములను సమతౌల్యముగ నిర్వహించిన ప్రతిభావంతురాలు. రఘునాథరాయలు ఈమెను "మధురవాణి" అని సత్కరించినాడు. అదే ఆ మహాకవయిత్రికి అన్వర్థనామధేయమైనది.

(సశేషం)



ఖండశర్కర

నిర్వహణ: శతావధాని ఎం.వి. పట్వర్ధన్
అష్టావధాని చేపూరి శ్రీరామ్

ఈనెల అంశం: పసిపిల్లలు-మరుమల్లెలు

డా. ఎం.పురుషోత్తమాచార్య, రామగిరి, నల్లగొండ

చం. జలధిని దాగు ముత్యములు స్వచ్ఛపు పిల్లల బోసినవ్వులే,
జలజల పారు నేరులవి శ్రావ్యపు బాలల చిల్కపల్కులే,
చెలగుచు తీయు రాగములు చెల్వగు కోయిల తీపిపాటలే,
పిలచిన ప్రాకివచ్చు పసిపిల్లలహెూ! మరుమల్లెలే కదా!?

ఉ. చన్నిడి పొట్టనింపు తన చక్కని తల్లికి ముద్దుపట్టియై,
వెన్ను,బుజమ్ములన్ నిలిపి పెంచిన తండ్రికి కూర్మిబిడ్డయై,
ఎన్నొ సరాగముల్ పలికి ఈ భువిపై దిగినట్టి చల్లనౌ
వెన్నెల వేల్పులైన పసిపిల్లలహెూ! మరుమల్లెలే కదా!?

చం. సరియగు ధర్మవర్తనపు సంస్కృతినందుచు భక్తితత్త్వమున్
బరపిరటంచు మాధవుడు వారక దీవనలిచ్చి మేలి స
ద్వరమిడ అమ్మ, నాన్నలగు దంపతులన్ చిరుపూలతీవకున్
విరియుచు తావులీను పసిపిల్లలహెూ! మరుమల్లెలే కదా!?

ఉ. ఎట్టి విచారమైన మరపింతురు. జబ్బులు మాయమౌను. ఏ
చట్టము చేయలేని పని చప్పున నొప్పుచు చక్కదిద్దు. ఊఁ
కొట్టుచు చెప్పి ఊసులను క్రూరత వీడగ మాయజేతురే!
బిట్టుగ నవ్వులిచ్చు పసిపిల్లలహెూ! మరుమల్లెలే కదా!?

చం. తెరచిన కోవెలౌ మనము దివ్యముగా వెలుగొందుచుండగా,
మెరయుచు దానియందు పరమేశుడు తానె విలాసరూపుడై
సరసవినోదియై, శిశుల స్వాంతముతో నెకసెక్కమాడుచున్,
విరివిగ నాటలాడ పసిపిల్లలహెూ! మరుమల్లెలే కదా!?

శిష్ట్లా వి ఎల్ ఎన్ శర్మ

ఉ. వెన్నెలవంటి నవ్వులను విచ్చిన యా పసిపాప మోమునన్
బున్నమి పూచె జూడు విరబూసిన స్వచ్ఛపు లేత కాంతులన్
మన్నెడి నవ్య కోమల సుమాలను బోలుచు మెత్తనౌచు బల్
వన్నెలు చిందె నా మొగముపై విర బూసిన మల్లెలై యొగిన్!

చం. తెలియని యూహలేవొ యెద తీయని చిత్రవిచిత్ర కాంతులన్
మిలమిలలాడు కన్నులను మెల్లగ జూచుచు తన్మయత్వమున్
బిలువగ నూ యటంచు దన పిడ్కిలి వట్టుచు కేలనూనుచున్
దలపుల దూగుచున్ బలు విధమ్ముల నాడెడి బాల్యమియ్యదే!

ఉ. వెల్లువయైన మానసము వీచెడి వైభవ హ్లాదరాగముల్
చల్లెడి తల్లిదౌ యొడిని సాగిలి హత్తుక విస్తువోవు నే
యెల్లలులేని స్వేచ్ఛ చిగురించగ ?ల్లుచు నవ్వి చిత్తమం
దల్లును తేట తావులనుహర్ష పరాగ విహార మందునన్!

ఉ. తోటల విచ్చె మల్లె లట దూగిరి పిల్లలు చేతనత్వమున్
మీటెను మానసమ్మున నమేయ ప్రకాశ సుహాసరాగముల్
మాటలవే వికాస నవమంజులమై యెదతోట బూయగా
నాటలనాడె బాలలటనా వనియందు ననంత మోదమున్!

ఉ. విచ్చును మల్లె, తావియును వీచు వనంబు నిరంతరంబుగన్
మెచ్చురె బోసినవ్వులను మేల్పడి మోము శ్రుతించ వారలన్
హెచ్చును ప్రేమరాగ రస హేల వచింపగ శక్యమౌనటే!
మచ్చికతోడ సాకగను మల్లెలు పిల్లలు నొక్కటేకదా!

పరిమి శ్రీరామనాథ్, పేకేరు.

శా. మీ సామీప్యసువర్ణకాలములలో మేమై సదానంద వి
న్యాసాక్రాంతహృదంతరంగులము, ప్రాణమ్మాడుటల్ కోమల
శ్వాసావృత్తుల నాకళింపగల మో పాపాయిలారా! సుధా
వాసాలోకనపాళి ముజ్జగములం బండించి దీవింపుఁడా!

మ. బలసంధాయకమైన మీ యునికి మా బాధావిపాకమ్ములన్
దొలగింపన్సుమగంధముల్ గవిసి,విద్యుద్వల్లికల్ బ్రాకి యౌ
దల, జీవ మ్మనుభూతమై, పులకరింతల్ వెల్లువై, నూతనా
శల పంటై మనఁగల్గువార మిట భాస్వద్రాగ లోకమ్ములో.

మ. మరుమల్లెల్ గదలాడు వేడుక కుటీమధ్యమ్మునన్ మీరు మీ
చిఱుజంజాటము లుప్పతిల్లు మతితోఁ, జేగొన్న గోలీలతోఁ
జరియింపన్ గమనించు మా కనులలో జాల్వారు బాష్పమ్ములే
కొఱఁతల్ పూరణ సేయు మాత్రలవు సంక్షోభాల రాపిళ్లలో.

మ. జతగావించి యనేకవస్తువులఁ జంచన్మార్దవశ్రద్ధతో
నతిసంప్రీతి, విశాలనేత్రముల మా కందించి చూపించి, స
న్నుతికై వేచెడు ముద్దుఁగాఱు మిము వేనోళ్లం బ్రశంసించినన్
మితిగాఁ దోచునుబీ పేరుకే కలవు సుమ్మీ! మాకు పెన్దేహముల్.

శా. ముక్తాచ్ఛత్రములార! కాంతిగతులౌ పూగుత్తులారా! సమా
సిక్తక్షేత్రములార! నిర్మలశుభశ్రీవృత్తులారా! నవా
సక్తాంకూరములార! క్షీరకలశస్కంధమ్ములారా! విని
ర్ముక్తిప్రాభవదీప్తులార! అరె, చాలుంజాలు మీ యల్లరుల్

పెనుకొండ రామబ్రహ్మం, బెంగుళూరు

ఉ. అల్లిన మల్లె తీగ కటులాదర మొప్పఁగఁ బెంచి చూడుమా
తెల్లని పుష్పముల్ విరియు తేజము నొందుచుఁ దోట రమ్యమౌ



వెల్లువ యౌను సౌరభము విచ్చిన పువ్వుల సోయగమ్మునన్!
ఝుల్లన పొంగు నుల్లమును జక్కని హాయినిఁ బొందు డెందమున్

ఉ. మల్లెల వోలె పిల్లలను మక్కువఁ జూపుచుఁ దల్లిదండ్రులున్
మెల్లగ సద్గుణమ్ములను మేటిగ నొందఁగఁ బెంపు సేసినన్
జల్లగ దేశ వృద్ధిఁ గను సంస్కృతి నెంచరె భావి పౌరులై
యెల్లలు లేని ఖ్యాతి యిల నింపుగ వర్ధిలు భాసమానమై

మ. విరియన్ మల్లెలు మోదమొందు పగిదిన్ విశ్వాస మేపారఁగన్
ధర యందున్ వికసించఁ బిల్లలను సద్భాగ్యమ్ముగాఁ దల్చుచున్
గరుణన్ బెంచఁగ దీక్షతా ధృతిని సంస్కారమ్ము నిగ్గారదే!
స్థిరమౌ విజ్ఞత సత్ప్రవర్తనము సుశ్రేయంబు సంధించదే!

మత్త.తోటమాలియు మల్లె పందిరి తోషమొందుచుఁ బెంచడే
యాటపాటలఁ దల్లిదండ్రులు హార్దముంచుచు శ్రద్ధగాఁ
బాటవమ్మును బెంపు సేయరె బాల బాలికలందునన్
నీటుగా భువి భేద మెంచక నీతిఁ బాయని యట్టులన్

అశ్వగతి మల్లెలు విచ్చఁగఁ దావుల మాధురి వ్యాప్తిఁగనున్
బిల్లలు ప్రజ్ఞను గాంచుట పెద్దల తుష్టిఁగనున్
మల్లెల గంధపు ఘ్రాణము మక్కువ నిచ్చునటుల్
పిల్లల సద్గుణసంపద వృద్ధియుఁ బ్రీతినిడున్!

ఇరువంటి నాగ దుర్గా మాధురీ దేవి, హైదరాబాద్

మ.కో. మల్లెమొగ్గలవంటి బాలలు మానవాళికి వెల్గులే
కల్ల కల్మషమే యెఱుంగని కాంతి దీపకలౌ సిరుల్
పిల్లపాపల పట్ల కుళ్ళయు బింకమేలన క్షేమమా
తల్లిదండ్రులు పెద్దలందరు ధర్మమార్గము వీడకన్
చల్లనౌ తమ నీడనందున సాగనిచ్చిన చాలునే
తల్లడిల్లు విధంబుగాక సుధారాసంబొలికించినన్
యెల్లలన్నియు దాటి నేర్పుగ యేలుచుందురు విశ్వమున్
వెల్లువౌ చిరునవ్వుతో తగు వెన్నెలల్ కురిపించుచున్.

ఉ. అల్లరి యంత జేసి దరహాసము చిందెడి బాలలన్ గనన్
పల్లవియై పదంబులె ప్రవాహముగా తగు గీతమాలికై
యల్లిక వేరదేలనుచు నద్భుతమైన సరాగమై మదిన్
మెల్లగ జేరి తంత్రులను మీటెను వీణను బోలు తీపితో.

రాజహంస:
8 త గణములు, యతి స్థానము 5వ గణము ఆద్యక్షరము
ఆద్యంతమే లేని యానందమే బాల్య
మాదర్శనీయంబు ప్రేమా సమీరంబు
హృద్యంబులే వారి హాసంబు సేవించి
శ్రేష్ఠంబుగా ప్రీతిమీరన్ లభించేను
వైద్యంబు లేకుండనారోగ్యమే యాయు
వై గాచునే నిత్యమున్ పంచి
సేద్యంబు గావించు చిహ్నంబులౌ వారి
క్షేమంబె లక్ష్యంబుగా సాగినన్ మేలు.

కల్పిక వృత్తము: న జ భ జ జ జ గ – గణములు –
యతి స్థానము 11వ అక్షరము
మమతను జూపి గారము ప్రమాణముగా చరియించినన్
సుమముల మించి సౌరభము శోభయు నందును ధాత్రిపై
యమవస లేని బాల్యమునె యన్ని విధంబుల గూర్చినన్
విమల మనస్సుతో మెలిగి విశ్వము నిల్పెదరే.

డా.రఘుపతి శాస్త్రుల, హైదరాబాద్

ఉ. చల్లని కాంతులొప్పుగల సంపదగా భువి తల్లి దండ్రులున్
పిల్లల గాంచుటెన్నవలె పెద్దరికమ్మును గూర్చ గల్లగా
ఎల్లలు లేని సంతసము నింపుగ నొందగ జన్మ సార్థక
మ్ముల్లమునందు గల్గ భువి నొప్పెడు సంపద బాలలే సుమీ

ఉ. బాలలు దైవ రూపములు వర్ధిలు నట్లుగ తల్లి దండ్రులున్
పాలన సేయ పేర్మి నిడు వారల వైభవమే మహిం గనన్
బాల రసాల సాల నవపల్లవ కోమల రూప భావనన్
శ్రీలుగ నుల్లసిల్లు పరిశీలన జేయ కపోల వాటికల్

ఉ. బాలలు భావి విశ్వమున వర్ధిలి పౌరులుగా మెలంగుచున్
మేలును గూర్చు చుందురు శ్రమించుచు సంపద లంద గల్గినన్
చాలును మేదినిన్ జనని సంతస మందుచు వారిదౌ క్రియా
శీలత నెన్ని సత్కృతుల శేషముగా వరియింప జేయునౌ

ఉ. ముద్దుల నొల్కు బాలలు ప్రమోదము గూర్చుదు రేరికైన సం
బద్ధత వారిదౌ నగవు పర్వము సేయును చూచువారికా
ఒద్దిక కూరుచుంటయు మహోత్సవమౌ కనువిందు సేయు నా
విద్దెలు గాంచ గల్గ మది ప్రేముడి పెంచును దాపు చేర్చుచున్

ఉ. మల్లియ లట్లు కన్పడెడు మానసముల్ గన మాతృమూర్తికే
చెల్లును పెంపుజేసి పరిశీలన జేయుచు రోజు రోజుకా
ఉల్లమునందు గాంచగల ఉత్సవ కాంతులు చెప్ప లేము సం
ధిల్లెడు ప్రేమ కూర్పు తనదే యని భావన సేయు భంగులున్

తదుపరి అంశం

హేమంత సీమంతిని

పై అంశానికి 5పద్యములను 9441039146
ఫోన్ నంబరుకు వాట్సప్ ద్వారా పంపగలరు
ఖండికలు పంపవలసిన ఆఖరు తేది
15 నవంబరు 2025



సంస్కృతం సంస్కృతి 2

నారుమంచి వేంకట అనంతకృష్ణ శర్మ

సంస్కృతమునకు సంస్కృతికి అవినాభావ సంబంధమున్నది. అయితే అవధానికి సంస్కృతితో అవసరమేమిటి? ఇది ఒక ప్రశ్న. భిన్నసంస్కృతుల సమాహారమైన భారతావనిలో సమాన ధర్మముగా ఉన్నదే సనాతనధర్మము. సత్ప్రవర్తన, సత్యవ్రతము, ధర్మపాలన మూలకందములుగా మన సంస్కృతి పరిఢవిల్లినది. ఈ అంశములు ప్రధానాంశములుగా సంస్కృతసాహిత్యము బహుముఖీనముగా పలు ప్రక్రియలలో విస్తరించినది. ఉదాహరణకు కాళిదాసు అభిజ్ఞానశాకుంతలములో కణ్వుని నోట సతీధర్మాలను, శకుంతల నోట సత్యవ్రతౌన్నత్యమును పలికించాడు. రామాయణ భారతాదులలో ధర్మసూక్ష్మములు కోకొల్లలు. లౌకిక జీవనములో, మానవీయసంబంధాలలో నిత్యోపయుక్తములైన అనేకానేకాంశాలు కావ్యాలుగా, శతకాలుగా, నాటకాలుగా, గద్యకావ్యాలుగా ఉపదేశాత్మకముగా వర్ణించబడినవి. ఇలాంటి సంస్కృత సాహిత్యము చదివిన అవధాని తన అవధానములో ఈ నీతులు ప్రస్తుత సమాజానికి అన్వయించి తన మేధతో పద్యం పండించినప్పుడు అవధానము విజయవంతమౌటయే కాక ఒక సామాజిక బాధ్యతను కూడా నిర్వర్తించినవాడౌతాడు. జనరంజకమైన అవధానానికి ఈ సాంస్కృతిక విజ్ఞానం ఎంతో తోడ్పడుతుంది అనుట నిస్సంశయము.

అవధానములో ప్రాశ్నికులడిగిన ఛందస్సులోనే పద్యనిర్మాణము చేయాలన్నది నియమము కదా. అంశములోని ప్రధానశబ్దములు ఇచ్చిన ఛందస్సులో ఇమడకపోవచ్చు. అలాంటి సందర్భములో సమానార్థకపదాలపైన ఆధారపడవలసినదే. సంస్కృతములోని **అమరకోశము, ధనంజనిఘంటువు** మొదలైనవి అధ్యయనము వలన కావలసినన్ని సమానార్థక పదాల సంపద అవధానికి అత్యంత ఆవశ్యకము. అంతేకాదు కొన్ని కొన్ని సమస్యల పరిష్కారానికి కూడా సంస్కృత భాషాజ్ఞానం తప్పనిసరి. ఒక ఉదాహరణ చూడండి. లబ్ధ ప్రతిష్ఠులైన 'అచ్చతెలుగు' శతావధాని శ్రీ పాలపర్తి శ్యామలానంద ప్రసాదు గారికి ఒక సమస్య ఇచ్చారుట. అది **'యోని తగిలిన చేయి కాలేను సామి'** వినటానికెంత ఇబ్బందిగా ఉంది కదా. అడిగినది పెద్ద పండితుడిని, అడిగిన వారు తక్కువవారు కాదు. అచ్చతెలుగు అవధానిగారు అమర కోశం వచ్చినవారు కనుక అగ్నికి ఉన్న పేర్లలో 'కృపీటయోని' అన్నది ఒకటి అని, ఆ 'కృపీట' అన్న పదాన్ని పైపాదాంతములో పెట్టారు. అంతే సమస్యకి సాధుత్వాన్ని సాధించారు. మిగతా పద్యభావమేదైనా కానీయండి. నిప్పు తగిలితే చేయి కాలుతుంది కదా మరి.

మరొక ఉదాహరణ చూద్దాం. ఆరుద్రగారు 'నను పాలింపగ నడచివచ్చితివా' అన్న పాటలో కంసుని చెరసాలని, కాంతల కౌగిళ్ళని, కరకురాతి గుడులను కూడా చెరసాలగా భావించారు. ఎంత సొగసుగా ఉంది అందరం మెచ్చుకున్నవారమే. మరి దీనికి ఒక ప్రేరణ ఉంది అనటానికి బిల్వమ్గలఠాకూర్ వ్రాసిన చౌరాష్టకంలో "వ్రజే ప్రసిద్ధం నవనీతచౌరం, గోప్గానానాం చ దుకూలచౌరమ్?, అనేకజన్మార్జిత పాపచౌరం, చౌరాగ్రగణ్యం పురుషం నమామి" అంటూ శ్లోకాలను చూడండి.

గమనించినట్లైతే ఛందోభేదాలు సంస్కృతములోనివే తెలుగులోకి గణప్రస్తారము అలాగే ఉంచుకుని యతి, ప్రాస నియమాన్ని అదనముగా చేర్చుకున్నాము. సంస్కృతకావ్యాలు చదవడం ద్వారా ఈ వృత్తనిర్మాణములోని గాఢత, సొగసు ఆకళింపుచేసుకునే అవకాశం అవధానికి లభిస్తుంది. ఇక సంస్కృత కావ్యాలను చదవడం ద్వారా సమాసనిర్మాణములో, పదసంచారములో విశేషమైన అనుభవము వస్తుంది. అప్పుడు అవధాని పద్యము పేలవముగా కాక చక్కని పదసౌష్టవముతో సారవంతమైన పద్యనిర్మాణ చాతుర్యం లభిస్తుంది. కనుక శబ్దసంపద కొరకు కానీ, క్రొత్తపదాల నిర్మాణమునకు కానీ, పద్యసంచారముపై సాధికారతకు కానీ, సమాస ప్రయోగమునకు కానీ సంస్కృత నిఘంటుజ్ఞానము కావ్యావలోకన ఆవశ్యకతను తెలుసుకున్నాము. అవధాని పూరణలలో భావుకతకున్న ప్రాధాన్యత రీత్యా ఆ అంశాన్ని మరొక్కసారి చూద్దాం. ప్రస్తుతానికి స్వస్తి.

ప్రహేళిక

మానసికోల్లాసానికి, ఆలోచనకు, పద సంపదకు ఆలవాలమై మన సాహిత్యంలో అనేకాంశాలున్నాయి. చిత్రకవిత్వంతో పాటు మరొక అంశం **'ప్రహేళిక'**. దానినే తెలుగులో **'పొడుపుకథ'** అనవచ్చును. అలాంటి వాటిలో ఒక శ్లోకం తెలుసుకుందాం.

ఒకరాజు పండితులకు ఒక ప్రశ్న వేస్తాడు. తెలుగులో సంస్కృతంలో సమాధానం ఒకే పదం ఉండాలి. ఆదేంటో చూద్దాం –

శ్లో॥ కిం వక్తి భిత్తినిర్మాతా చాంచల్యం కుత్ర వర్తతే ।
ఆంధ్ర గీర్వాణ భాషాభ్యాం ఏకమేవోత్తరం పద ॥

అర్థ వివరణ: భిత్తినిర్మాతా = గోడలు కట్టేవాడు (సుతారి, మేస్త్రి); కిం వక్తి = ఏమని వస్తువును తెమ్మంటాడు; చాంచల్యం = చంచలత్వం, అస్థిరత్వం; కుత్ర = ఎక్కడ; వర్తతే = ఉంటుంది. అంటే సమాధానం **'పారదే'**. మేస్త్రీ తెలుగులో 'పార తీసుకురా!' అంటాడు. అదే చంచలత్వం – 'పారదే' అంటే 'పాదరసంలో' అని సంస్కృతం. ఇలా 'పారదే' అనే పదమే రెంటికీ సమాధానం.

- 'అష్టావధాని' ముత్యంపేట గౌరీశంకరశర్మ





తెలంగాణ భాషాదినోత్సవం సందర్భంగా శ్రీ చంద్రశేఖర ఎడ్యుకేషనల్ ట్రస్టు , ఆత్మీయ మిత్రమండలి ఆధ్వర్యవంలో జడ్చర్లలో జరిగిన **చేపూరి శ్రీరామ్** గారి అష్టావధానం.

సంయోజకులు: డా॥ ఉమ్మెంతల మహేశ్వర్; సంచాలకులు: కంది శంకరయ్య

పర్యవేక్షణ: బాద్మి శివకుమార్ (తొలి నాటక అకాడెమీ చైర్మన్)



భక్తిసాధనం ఆధ్వర్యవంలో 01-10-2025 న భాగ్యనగరంలోని బోయిన్‌పల్లి శ్రీభోళాశంకర మందిరంలో శతావధాని **డా॥ తాతా సందీప్‌శర్మ** గారి అష్టావధానం.

నిర్వాహకులు: పండరి రాధాకృష్ణ ; సభాధ్యక్షులు: ‘అష్టావధాని’ బండకాడి అంజయ్యగౌడ్

Avadhana Puskarini
23 October 2025



అవధాన విద్యా విజయతే తరామ్

Published by
Avadhana Vidya Vikasa Parishat
Sri Rama Sadanam, 29-1499/6/1, Road No.1
West Kakatiya Nagar, Neredmet, Secunderabad - 500056
Ph: 9441039146